సూర్య www.suryaa.com
18వ వసంతంలోకి ...
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

సంపుటి 18 | సంచిక 185
సోమవారం | 28 ఏప్రిల్ 2025 | హైదరాబాద్ | పేజీలు 8+8 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - వసంత ఋతువు, బహుళ వైశాఖ శుద్ధ పాడ్యమి రా.10.57, భరణి రా.11.28 వరకు, వర్జ్యం ఉ.10.03 నుంచి 11.32 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.26 నుంచి 1.15 వరకు తిరిగి మ. 2.53 నుంచి 3.42 వరకు

# కశ్మీర్ అభివృద్ధిని ఓర్వలేకే ఉగ్రదాడి

- మన్‌కీ బాత్ 121వ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని
- డా.కె.కస్తూరిరంగన్ గారికి చాలా వినమ్రంగా నివాళులు
- ఉగ్రదాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు
- దాడికి పాల్పడిన వారికి అత్యంత కఠినమైన శిక్షలు
- ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నవారి వెన్ను విరుస్తామని హెచ్చరిక
- పహల్గాం ఘటనపై మోడీ

మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమం 121వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు.



6లో

## విధ్వంసం నుంచి
# వికాసం వైపు



2లో

● రాజధాని నిర్మాణం రాష్ట్రానికి నవోదయం ● రాష్ట్రంలోని ప్రతి పౌరుడు గర్వపడేలా ప్రజా రాజధాని : సిఎం చంద్రబాబు ● క్యాపిటల్ రీ స్టార్ట్ కార్యక్రమంపై సమీక్ష-ప్రధాని సభ గ్రాండ్ సక్సెస్ చేయాలన్న సిఎం ● ప్రధాని మోడీ పర్యటనపై సీఎం స్పెషల్ ఫోకస్ ● ప్రధాని రాక కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు ● లక్షలాదిగా రైతులు, ప్రజలు తరలి వచ్చేలా యత్నాలు ● జరుగుతున్న ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష..

## 'ఎప్పుడైనా, ఎక్కడైనా రెడీ'
### పాకిస్థాన్‌కు ఇండియన్ నేవీ స్ట్రాంగ్ మెసేజ్!

పహల్గాం ఘటన నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఇండియన్ నేవీ సిద్ధమవుతోంది. అందులో భాగంగా అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. ఈ విషయాన్ని సమాజిక మధ్యమం ద్వారా ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన నేపథ్యంలో సన్నద్ధతను పరీక్షించుకునేందుకు వీటిని ప్రయోగించింది. సముద్ర జలాల్లో ఎప్పుడైనా- ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు ఇండియన్ నేవీ రెడీ అని ప్రకటించింది.



2లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## సీఎం రేవంత్ రెడ్డితో
# శాంతి కమిటీ సమావేశం



3లో

జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శాంతి చర్చల కమిటీ నేతలు సమావేశమయ్యారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని ముఖ్యమంత్రి ని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్ వినతిపత్రం సమర్పించారు.

## చందనోత్సవం
# ఏర్పాట్లపై సమీక్ష



2లో

● ప్రశాంతంగా జరిగేలా చర్యలు ● అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు ● సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యత హోంమంత్రి అనిత


## తెలంగాణ సీఎస్‌గా కె రామకృష్ణారావు
### భారీగా ఐఏఎస్‌ల బదిలీలు



ప్రస్తుత సీఎస్ శాంత కుమారి ఈనెల 30వ తేదీన పదవీ విరమణ పొందనున్నారు. ఆమె స్థానంలో ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్‌గా ఉన్న రామకృష్ణారావు తెలంగాణ రాష్ట్ర కొత్త సీఎస్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు-3లో

## అంతా ఇంతే!




వచ్చే ఎన్నికల్లో పాసయ్యేది మనమేనా సార్

# కాంగ్రెస్సే విలన్



3లో

● కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మేం పడగొట్టం ● రానున్న మూడేళ్లు సక్రమంగా చేయకపోతే ప్రజలే వీపులు పగలగొడతారు ● బీజేపీ 11 ఏళ్లలో 11 రూపాయిలు కూడా ఇయ్యలే: కేసీఆర్ ● తెలంగాణపై మోదీ ఇంకా విషం చిమ్ముతూనే ఉన్నారు ● బలం ఉందని చంపుకుంటూ పోవడం సరికాదు ● యావత్ తెలంగాణ సమాజానికి, బిఆర్ఎస్ కేడర్‌కు రజతోత్సవ శుభాకాంక్షలు ● టిఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

## రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల
# సంక్షేమానికి కృషి

● దశలవారీగా పెండింగ్ అంశాల పరిష్కారం
● మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



3లో

రిటైర్డ్ ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యానికి సహకారం అందిస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ అంశాలను దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎన్ఐఏ చేతికి పహల్గాం
# దాడి వీడియో



6లో

పహల్గాం దాడికి సంబంధించిన అత్యంత కీలక ఆధారమైన ఓ వీడియో ఇప్పుడు ఎన్ఐఏ చేతికి వచ్చింది. బైసరన్‌కు వచ్చే టూరిస్టుల కోసం రీల్స్‌ను చిత్రీకరించే ఓ స్థానిక వీడియో గ్రాఫర్ ఈ దాడి మొత్తాన్ని కెమెరాలో బంధించాడు. దాడి జరిగే సమయంలో అతడు ఓ చెట్టుపై దాక్కొని మొత్తాన్ని చిత్రీకరించాడు. ఆ వీడియోల ఆధారంగా జరిగిన దారుణాన్ని ఓ వరుసక్రమంలో తెలుసుకొనేందుకు జాతీయ దర్యాప్తు సంస్థకు కీలకంగా మారాయి.

# గోవిందప్ప బాలాజీ దొరికితే భారతి సిమెంట్స్ సీజ్ ?

గోవిందప్ప బాలాజీ. ఇప్పుడీ పేరు తాడేపల్లిలో ప్రముఖంగా వినిపిస్తోంది. ఎవరు దొరికినా పర్వాలేదు ఆయన మాత్రం దొరకకూడదని.. తాడేపల్లిలోని అత్యున్నత వర్గాలు ఆయనను దాచి పెడుతున్నాయి. ఈ గోవిందప్ప బాలాజీ ఎవరో కాదు భారతి సిమెంట్స్ ఆర్థిక వ్యవహాలన్నీ చూసే వ్యక్తి. అలాగే వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి కూడా ఆయనేనని చెబుతున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత లిక్కర్ స్కాంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చిన తర్వాత.సీఐడీ లాగుతున్న తీగ తమ దాకా వచ్చిందని తెలిసిన తర్వాత ఆయనను ఆజ్ఞాతంలోకి పంపేశారు.

ఈ గోవిందప్ప బాలాజీ.. చాలా సొమ్మును భారతి సిమెంట్స్‌కి ప్రవహింప చేశారు. ఆ సొమ్ము ఎక్కడిది అన్నది రాబట్టాల్సి ఉంది.

నిజానికి అసలు భారతి సిమెంట్స్ జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి చెందినది కాదు. అందులో మెజార్టీ వాటాలు అంటే 51శాతం ఫ్రాన్స్ కు చెందిన వికాట్ అనే కంపెనీ కొనేసింది. కానీ ఆ కంపెనీకి చెందిన వాళ్లెవరూ పట్టించుకోరు. అన్నీ భారతి రెడ్డి కనుసన్నల్లోనే జరుగుతాయి. ఎప్పుడో పదిహేళ్ల క్రితమే రెండు వేల కోట్లు పెట్టి భారతి సిమెంట్స్ ను కైవసం చేసుకుని దాన్ని అమ్మినవారికే వదిలి పెట్టిపోయే మహానుభావులు ఎవరు ఉంటారు ?. ఇందులో ఏదో తిరకాసు ఉండకపోతే.

అవన్నీ దొరికిపోతాయన్న భయంతోనే ఇప్పుడు గోవిందప్ప బాలాజీని హైడ్ చేసేశారు. ఎక్కడ దాచినా.. ఎప్పుడో ఒకప్పుడు దొరకాల్సిందే. గుట్టు బయటకు లాగాల్సిందే. అయితే ఈ వ్యవహారాలన్నీ జగన్ ను దాటి ఆయన సతీమణి వద్దకు వెళ్తాయనే ఎక్కువ మంది వైసీపీ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. భారతి ఆర్థిక వ్యవహారాలు చూసే గోవిందప్ప బాలాజీ దొరికితే చాలా విషయాలను ఆయన చెప్పకూడదనుకున్నా బయటకు లాగేస్తారు. అదే అసలు టెన్షన్.

# విధ్వంసం నుంచి
# వికాసం వైపు

● రాజధాని నిర్మాణం రాష్ట్రానికి నవోదయం ● రాష్ట్రంలోని ప్రతి పౌరుడు గర్వపడేలా ప్రజా రాజధాని : సిఎం చంద్రబాబు
● క్యాపిటల్ రీ స్టార్ట్ కార్యక్రమంపై సమీక్ష-ప్రధాని సభ గ్రాండ్ సక్సెస్ చేయాలన్న సిఎం
● ప్రధాని మోడీ పర్యటనపై సీఎం స్పెషల్ ఫోకస్ ● ప్రధాని రాక కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు
● లక్షలాదిగా రైతులు, ప్రజలు తరలి వచ్చేలా యత్నాలు ● జరుగుతున్న ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష..

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి పనుల వున:ప్రారంభ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.

ఉండవల్లి నివాసంలో మంత్రులు, ఉన్నతాధికారులతో మే2వ తేదీన జరిగే సభ ఏర్పాట్లపై చర్చించారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పనులు మళ్లీ ప్రారంభం అవుతున్నాయని... ఆ రోజు రాష్ట్ర చరిత్రలో గొప్ప మలువు కానుందని సిఎం అన్నారు. నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు రాష్ట్ర రాజధాని ప్రయాణం సాగనుందని సిఎం అన్నారు. గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు, దాడులు చేసిందని... అయితే అన్ని ప్రాంతాల, అన్ని వర్గాల ప్రజల అభిలాష మేర ప్రారంభమైన అమరావతి అనేక సవాళ్లను, కష్టాలను ఎదుర్కొని నిలబడిందని సిఎం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో... గత ప్రభుత్వ కారణంగా తలెత్తిన సవాళ్లను పరిష్కరించి, నిలిచిపోయిన పనులను మళ్లీ పట్టాలెక్కిస్తున్నామని సిఎం అన్నారు. ఏ ప్రధాని చేతుల మీదుగా అయితే శంకుస్థాపన చేసిన రాజధానిని విధ్వంసం చేశారో... నేడు మళ్లీ అదే ప్రధాని చేతుల మీదుగా పనులు తిరిగి ప్రారంభించి... ఒక అద్భుత రాజధానిని నిర్మించి... విధ్వంసకారులకు గట్టి సమాధానం చెబుతున్నామని సిఎం అన్నారు. అమరావతి అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష, సెంటిమెంట్ అని... దీన్ని ఎవరూ దెబ్బతీయలేరని సిఎం అన్నారు. అమరావతి సంపద సృష్టి కేంద్రంగా, అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాంతంగా మారుతుందని సిఎం అన్నారు.

కుట్రలకు, కుతంత్రాలకు ప్రజా రాజధాని, ఆంధ్రుల స్వప్నాన్ని ఎవరూ చెరిపివేయలేరని చాటి చెప్పేందుకే... మళ్లీ దేశం అంతా గుర్తించేలా రాజధాని పనులను స్వయంగా ప్రధాని చేతుల మీదుగా వున: ప్రారంభిస్తున్నామని సిఎం అన్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా, వేడుకగా నిర్వహించాలని... రాష్ట్రంలోని ప్రతి పౌరుడు నాది ఆంధ్ర ప్రదేశ్... నా రాజధాని అమరావతి అని చెప్పుకునేలా అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రధాని కూడా రాజధాని నిర్మాణంపై ఆసక్తితో ఉన్నారని... మొన్న జరిగిన ఢిల్లీ భేటీలో పలు సూచనలు చేశారని సిఎం గుర్తు చేశారు.

**ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు :** ఈ సందర్భంగా ప్రజెంటేషన్ ద్వారా అధికారులు 2వ తేదీ కార్యక్రమ నిర్వహణ క్రమాన్ని, ఏర్పాట్లను వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చూడాలని సిఎం సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి తాగునీరు, ఆహారం అందించాలని సిఎం సూచించారు. భద్రతా పరంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని... ఇదే సమయంలో సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా వేదిక వద్దకు చేరుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా రాజధాని గ్రామాల ప్రజలకు ఈ కార్యక్రమంలో ఎక్కువ భాగస్వామ్యం ఉంటుందని... వారంతా సభకు రావాలని భావిస్తారని సిఎం అన్నారు. రవాణా సహా ఇతర అంశాల్లో అధికారులు ఎప్పటికప్పుడు తగు



సూచనలు, ప్రకటనలు చేసి ఎవరికీ అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నారాయణ, కొల్లు రవీంద్ర, మనోహర్, సత్యకుమార్ హాజరయ్యారు. డీజీపీతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

**ప్రధాని మోడీ పర్యటనపై సీఎం స్పెషల్ ఫోకస్**

మరోవైపు: ఆంధ్రప్రదేశ్లో పర్యటించబోతున్నారు ప్రధాని నరేంద్ర మోడీ.. వచ్చేనెల 2న ప్రధాని మోడీ అమరావతికి వస్తున్నారు ప్రధాని రాక కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తోంది ఏపీ ప్రభుత్వం .. లక్షలాదిగా రైతులు, ప్రజలు తరలి రావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.. సెక్రటేరియట్ వెనుక స్థలంలో అతిపెద్ద సభ ఏర్పాటు చేస్తున్నారు.. ఆ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. ప్రధాని మోడీ రాకకు చేస్తున్న ఏర్పాట్లు పై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. సమీక్షలో మంత్రివర్గ ఉపసఘంతో పాటుగా అధికారులు హాజరయ్యారు.. ప్రధాని మోడీ రాకకు జనసమీకరణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసారు.. ప్రజలు, రైతులు అమరావతి చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి రావడానికి వీలుగా 8 దారులను సిద్ధం చేశారు.. 3 అదనపు దారులను సైతం ఏర్పాటు చేశారు.

అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని మోడీని సీఎం స్వయంగా ఆహ్వానించారు.. సభకు ప్రధాని మోడీ, మధ్యాహ్నం 3:25కి వస్తారు.. 3:32కి వేదిక మీదకు వస్తారు.. 3:50కి 11 నిముషాల అమరావతి పనుల వీడియో ప్లే అవుతుంది.. 4:05 నుంచి 40 నిముషాలు ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తారు.. ఆ తరువాత ప్రధాని నరేంద్ర మోడీ బయల్దేరి వెళ్తారు అయితే మోడీ రాక సమయంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు ఉంటాయి.. అలాగే రైతులు చేరుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని సీఎం ఆదేశించారు. ఇకపై ప్రధాని మోడీ పర్యటన పూర్తయ్యే వరకు ప్రతీరోజూ సీఎం సమీక్షలు నిర్వహించనున్నారు.

# నేడు పద్మ అవార్డుల ప్రదానం

**అందజేయనున్న రాష్ట్రపతి ముర్ము**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పద్మ అవార్డులను ప్రదానం చేయనున్నారు. నందమూరి బాలకృష్ణ పద్మవిభూషణ్ అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి నారా లోకేష్ దంపతులు సోమవారం ఢిల్లీ రానున్నారు. కాగా నటన అనేది ఓ ఉద్యోగంలా భావించకుండా ఓ కళగా ఆరాధించే నటుడు నందమూరి బాలకృష్ణ. అటు నటన, ఇటు రాజకీయాలు, మరో పక్క వైద్యరంగంలో సేవలు.. ఇలా ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పని చేస్తూ తెలుగు చిత్ర పరిశ్రమకు విశేషసేవలు అందిస్తున్న బాలకృష్ణ కృషికి గుర్తింపుగా ఇప్పుడు పద్మభూషణ్ పురస్కారం లభించడంతో అన్ని వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అప్పుడెప్పుడో 1960ల్లో సీనియర్ ఎన్టీఆర్‌కు పద్మశ్రీ పురస్కారం లభించింది. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ నందమూరి వంశానికి పద్మ పురస్కారం లభించడం ఇదే. ఐదు దశాబ్దాల బాలకృష్ణ నట జీవితంలో భారీ విజయాలే కాదు.. కొన్ని పరాజయాలూ ఉన్నాయి. అపజయానికి ఆయన ఎప్పుడూ కుంగిపోలేదు. విజయానికి దగ్గిర దారులు వెదుక్కుంటూ రాజీ పడలేదు. డైలాగ్ చెప్పడంలో బాలకృష్ణది ఒక ప్రత్యేక ఒరవడి. కళ్ల వెంట నిప్పులు కురిపిస్తూ బేస్ వాయిస్‌లో ఆయన తెరపై డైలాగులు చెబుతుంటే థియేటర్లు దద్దరిల్లి పోతుంటాయి. తండ్రి ఎన్టీఆర్‌లా బాలకృష్ణకు కూడా తెలుగు భాష అంటే ఎంతో గౌరవం. సినిమాల్లో తెలుగుదనం ఉట్టిపడే పదాలతో డైలాగులు చెప్పే బాలయ్య నిజజీవితంలో కూడా తన ఆహార్యం, అలవాట్లతో ప్రత్యేకంగా కనిపిస్తారు. క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు బాలకృష్ణ. అలాగే ఆయనది ముక్కుసూటితత్వం. నాన్చుడు వ్యవహారం ఆయనకు నచ్చదు. మనసులో ఏముందో అది బయటకు చెప్పడం, నిజాన్ని నిర్భయంగా వెల్లడించడం అలవాటు. ఆరు పదుల వయసులో కూడా ఎంతో చలాకీగా ఉంటూ యువ హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు బాలకృష్ణ. అన్‌స్టాపబుల్ కార్యక్రమంతో దేశ వ్యాప్తంగా ఆయన క్రేజ్ సంపాదించుకున్నారు.

# చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్ష



● సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యత హెూంమంత్రి అనిత
● ప్రశాంతంగా జరిగేలా చర్యలు ● అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి :సింహాచలంలో కొలువు తీరిన శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారి చందనోత్సవంకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఆదివారం సింహాచలంలో స్వామి వారిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం చందనోత్సవంకు సంబంధించిన ఏర్పాట్లును ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలను దేవస్థానం ఉన్నతాధికారులకు ఆమె చేశారు. అనంతరం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. చందనోత్సవం నేపథ్యంలో సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. శ్రీ వరహా లక్ష్మి నరసింహా స్వామి వారిని భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. అయితే అంతరాలయ దర్శనాలు ఉదయం ఆరు గంటలతో ముగిస్తాయని స్పష్టం చేశారు. సింహాచలం పరిసర ప్రాంత్రాలలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. ఇక భక్తుల కోసం పెద్ద సంఖ్యలో బస్సులను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ చందనోత్సవం సందర్భంగా సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా.. వివిధ శాఖల ఉన్నతాధికారుల సమన్వయంతో దేవస్థానం ఉన్నతాధికారులు ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఐదుగురు మంత్రుల బృఎందం ఈ చందనోత్సవం ఏర్పాట్లుపై సమీక్షించారని మంత్రి అనిత గుర్తు చేశారు. ఈ ఏడాది స్వామి వారి చందనోత్సవానికి సుమారు రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ఎన్డియే ప్రభుత్వంలో ఇటీవల వివిధ ఆలయాల్లో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత గుర్తు చేశారు.

అంతకు ముందు ఇక స్వామి వారిని దర్శించుకొనేందుకు సింహాచలం దేవాలయానికి వచ్చిన హోం మంత్రి వంగలపూడి అనితకు ఆలయ మర్యాదలతో అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత పండితులు ఆమెకు వేద ఆశీర్వచనం చేశారు. తదానంతరం మంత్రి అనితకు స్వామి వారి చిత్ర పట్నాన్ని, ప్రసాదాన్ని ఆమెకు ఆలయ అధికారులు అందజేశారు. ఏప్రిల్ 30వ తేదీన సింహాచలంలో అప్పన్న చందనోత్సవం జరగనుంది. ఏడాది పొడవునా చందనరూపుడై ఉండే శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆ ఒక్కరోజే భక్తులకు నిజరూప దర్శనమిస్తారు. అందుకోసం రాష్ట్రం నుంచే కాకుండా.. ఇతర రాష్ట్రాల నుంచి సైతం భారీగా భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను హోం మంత్రి అనిత సమీక్షించారు.

# ఏపీ లిక్కర్ స్కాంలో అరబిందో ఫార్మా!







ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ లిక్కర్ స్కాంలో అరబిందో ఫార్మా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆ సంస్థ నుంచి వంద కోట్ల రూపాయల లోన్ ఇతర కంపెనీలకు ఇప్పించానని విజయసాయిరెడ్డి ప్రకటించారు. అది లోన్ కాదు.. లోన్ రూపంలో లంచం అన్న ఆరోపణలు వస్తున్నాయి. అరబిందో కంపెనీలోకి లిక్కర్ స్కాం ప్రవహించినట్లుగా అనుమానిస్తున్నారు. ఆ కంపెనీ రుణాలు ఇచ్చిందో లేదో తెలియదు కానీ.. చెల్లింపులు మాత్రం జరిగాయని సీఐడీ అధికారులు గుర్తించారు. ఇప్పుడు అరబిందోను కాపాడటానికే విజయసాయిరెడ్డి రుణం అని కవర్ చేసే ప్రయత్నం చేశారు. సజ్జల శ్రీధర్ రెడ్డి కూడా 45 కోట్లు అరబిందో వద్ద రుణం తీసుకున్నానని చెబుతున్నారు. కానీ ఈ సజ్జల శ్రీధర్ రెడ్డి ఆ సంస్థలో బలవంతంగా చేరిన డైరక్టర్ మాత్రమే. ఆ డబ్బులు పెట్టుబడి పెట్టలేదు. అసలు ఎలా ఇచ్చారో.. ఎలా ఖర్చు పెట్టారో స్పష్టత లేదు. కానీ చెల్లింపులు చేశారు. లిక్కర్ స్కాంను వైట్ చేసే వ్యవహారంలో భారతి సిమెంట్స్, పీఎల్ఆర్ ప్రాజెక్ట్స తో పాటు అరబిందోను కూడా ఉపయోగించుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరబిందో ఫార్మా వారసుడు అయిన శరత్ చంద్రారెడ్డి అరెస్టు అయినప్పుడు ఆ సంస్థ షేర్లు భారీగా పతనం అయ్యాయి. అప్పుడు ఆయనను కంపెనీలోని బాధ్యతల నుంచి తప్పించారు. అరబిందో పేరుతో ఆ శరత్ చంద్రారెడ్డి చేస్తున్న ఇతర వ్యాపారాల పేర్లను మార్చాలని వాటాదార్లు ఒత్తిడి చేశారు. దాంతో ఆయనతో కంపెనీ పేరును ఔరో రియాలిటీ అని మార్చుకున్నారు. ఆ స్కాంతో నేరుగా అరబిందో ఫార్మాకు సంబంధం లేకుండా పోయిది. కానీ ఏపీ లిక్కర్ స్కాంతో మాత్రం నేరుగా సంబంధం ఏర్పడిపోయింది.లిక్కర్ స్కాం కంపెనీలకు అప్పుగా డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఏమిటి ? ఆ లిక్కర్ స్కాం డబ్బుల్ని మళ్లీ తమ ఖాతాల్లో వేసుకోవడం ఎందుకు అన్న ప్రశ్నలు వస్తాయి. ఏపీ దర్యాప్తు సంస్థలు అరబిందోపై దృష్టి పెట్టినప్పుడు.. ఒక వేళ ఐటీ,ఈడీలు రంగంలోకి దిగితే.. వాటి దర్యాప్తులు ప్రారంభమైనప్పుడు అరబిందోఫార్మాకు గడ్డు పరిస్థితి తప్పకపోవచ్చు.

# రాజు-గంటా మధ్య విబేధాలు ముగిసినట్టేనా?

● విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఇరు నేతల వాగ్వివాదం
● గంటాకు విష్ణుకుమార్ రాజు క్షమాపణలెందుకు?: ● పైన సమసినట్టునా లోలోన రగులుతున్నాయా?



విశాఖపట్నం: ఏపీలో కూటమి నేతల మధ్య చిన్నిచిన్న విబేధాలు తెరపైకి వస్తున్నాయి. ఒకప్పుడు గుట్టుగా సాగే ఈ వ్యవహారం రచ్చకు దారితీస్తోంది. ఇంతకీ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు- బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మధ్య విబేధాలేంటి? గంటా ఆగ్రహానికి కారణమేంటి? ఎందుకు విష్ణుకుమార్ రాజు క్షమాపణలు చెప్పారు. అన్నది ఆసక్తికరంగా మారింది.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. విశాఖ ఫిలింనగర్ క్లబ్కు గత ప్రభుత్వం భూములు కేటాయించింది. దీనికి సంబంధించి కలెక్టర్కు విష్ణుకుమార్ రాజు లేఖ ఇవ్వడంలో పొరపాటు జరిగిందని తెలిపారు. ఈ వ్యవహారం నేపథ్యంలో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గంటా శ్రీనివాసరావు-విష్ణుకుమార్ రాజు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

తన సంతకం లేకుండా తన నియోజకవర్గానికి సంబంధించిన అంశంపై కలెక్టర్కు లేఖ ఎలా ఇస్తారంటూ సదరు బీజేపీ ఎమ్మెల్యేపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు గంటా వెళ్లి పోయిన తర్వాత మీడియాతో మాట్లాడిన విష్ణుకుమార్ రాజు. ఫిల్మ్ క్లబ్ కు ఐదు ఎకరాల భూమిని గత ప్రభుత్వం కేటాయించింది. అలాట్ మెంట్ లెటర్లో 33 ఏళ్లు అనేది మిస్సయ్యింది. దీనిపై కరెక్షన్ చేయడానికి కలెక్టర్ ని కలిసి లేఖ ఇచ్చామన్నారు.

ఈ లెటరు అప్పటికప్పుడు తయారు చేసిందని, ఆ సమయంలో ఎమ్మెల్యే గంటా అక్కడ లేరన్నారు. పద్ధతి ప్రకారం స్థానిక ఎమ్మెల్యే సంతకం తీసుకుని కలెక్టర్కి ఇవ్వాలని గుర్తు చేశారు. దీనివల్ల గంటాకు క్షమాపణలు చెబుతున్నట్లు వెల్లడించారు. ఇక్కడితో ఇరువురు ఎమ్మెల్యేల మధ్య విబేధాలకు దాదావు ఫుల్స్టాప్ పడినట్టేనని అంటున్నారు.

నార్మల్గా గంటా శ్రీనివాసరావు-విష్ణుకుమార్ రాజుకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు ముంటుందని విశాఖ ఉత్తర నియోజకవర్గం ప్రజల మాట. ఎందుకంటే విశాఖ ఉత్తర నియోజకవర్గానికి విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యే. దాన్ని ఆయన కంచుకోటగా మార్చుకున్నారు. 2014లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ-బీజేపీ అభ్యర్థిగా రాజు గెలుపొందారు. ఆనాటి నుంచి నియోజకవర్గంలో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి.

2019లో అదే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు, టీడీపీ నుంచి గంటా, వైసీపీ నుంచి కేకేరాజు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో గంటా విజయం సాధించారు. ఈ నేపథ్యంలో గంటా వర్సెస్ రాజుకు మధ్య మాటలయుద్ధం తారాస్థాయికి చేరింది. ఒకరినొకరు ముఖం చూసుకునే స్థాయికి వెళ్లిపోయింది. విబేధాల గురించి ఇరువురు నేతలు తమ సన్నిహితుల వద్ద చెప్పేవారు.

మీడియా ముందు ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భం లేదు..రాలేదు కూడా. ఈ నేపథ్యంలో విశాఖలో కార్పొరేషన్ మేయర్ ఎన్నికల సందర్భంగా విష్ణుకుమార్ రాజుపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారు. పైకి ఇరువురు నేతల మధ్య విబేధాలు సమిసిపోయినా, లోలోపల మాత్రం మంట రగులుతూనే ఉంటుందని అంటున్నారు ఆ నియోజకవర్గం నేతలు. రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం ఇంకెన్ని మలువులు తిరుగుతుందో చూడాలి.

# వివేకా కేసు సాక్షుల మృతిపై సిట్ విచారణ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారు ఒక్కొక్కరుగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై సిట్ విచారణ చేపట్టింది. వివేకా హత్య కేసులో మొత్తం ఆరుగురు సాక్షులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇటీవల కీలక సాక్షి అయిన రంగన్న మృతితో ఈ కేసును ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సిట్‌ను ఏర్పాటు చేసింది. వరుసగా సాక్షులు మృతి చెందడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వివేకా ఇంటి వాచ్‌మేన్ రంగన్న చనిపోవడానికి ముందు కె.శ్రీనివాసరెడ్డి 2019, సెప్టెంబరు 3న, వైఎస్ జగన్ వాహన డ్రైవరు నారాయణ యాదవ్ 2019 డిసెంబరు 6న, వైఎస్ భారతి తండ్రి డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 2020 అక్టోబరు 3న, గంగాధర్‌రెడ్డి 2022 జూలైలో, డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి 2025 జనవరి 10న మరణించారు. దీంతో కొంతకాలంగా పులివెందులలో సిట్ అధికారులు విచారిస్తున్నారు. పట్టణంలో నివాసం ఉంటున్న కె.శ్రీనివాసరెడ్డి బామ్మర్ది కసునూరు పరమేశ్వర్‌రెడ్డి ఇంటికి శనివారం సిట్ బృఎందం వెళ్లి ప్రత్యేక వాహనంలో విచారణ కోసం లింగాల పోలీసుస్టేషన్ తీసుకువెళ్లింది. అక్కడ సుదీర్ఘంగా విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అలాగే ఈ కేసులో మరో కీలక సాక్షి మృతుడు రంగన్న భార్య సుశీలమ్మను విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసు ఇచ్చారు. రంగన్న పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా ఈ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నట్లు సమాచారం.

# నేడే గ్రేటర్ విశాఖ మేయర్ ఎన్నిక..

విశాఖపట్నం : ఏపీలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ జీవీఎంసీపై జెండా ఎగరేయాలన్న టీడీపీ కల ఎట్టకేలకు నెరవేరింది. ఏడాది కాలపరిమితి కోసం జరుగుతున్న ఎన్నికల్లో కూటమి విజయం లాంఛనం అయింది. మేయర్ అభ్యర్థిగా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్ పేరును టీడీపీ అధిష్టానం ఖరారు చేసింది. పార్టీ బీఫార్మ్ ను పీలాకు అందజేశారు నగర పార్టీ అధ్యక్షుడు గండిబాబ్జీ. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరుగుతుంది. 98 వార్డులతో వున్న మహా విశాఖ నగర పాలక పీఠం దక్కించుకోవడం రాజకీయ పార్టీలు కీలకంగా భావిస్తాయి. 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి వున్న స్టీల్ సిటీ పై పట్టు సాధించాలంటే మేయర్ పీఠం కీలకం. తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి విశాఖ కంచుకోటే అయినప్పటికీ స్థానిక సంస్థలపై ఆజిమాయిషీ చేసే ఛాన్స్ లభించలేదు. 2011లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 58 వార్డులు గెలుచుకుని మేయర్ పీఠం దక్కించుకుంది. నలుగురు ఎమ్మెల్యేల బలం వుండి కూడా టీడీపీ 28 స్థానాలకు పరిమితం అయింది.ఇక, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత లోకల్ బాడీస్ నాయకత్వం మార్పు అనివార్యం అయింది. ఆ జాబితాలో జీవీఎంసీ చేరగా అనూహ్యమైన రాజకీయ పరిణామాలు, క్యాంప్ రాజకీయాలు జరిగాయి. వైఎస్సార్సీపీ, కూటమి పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించడంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మ్యాజిక్ ఫిగర్ 74 కోసం ఆఖరి నిముషం వరకు ఊగిసలాట కొనసాగడంతో ఫలితం తీవ్ర ఉత్కంఠకు గురిచేసింది. మాజీమంత్రి అవంతి శ్రీనివాస్ కుమార్తె, 6వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక ఓటుతో కూటమి గట్టెక్కింది. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నాలుగేళ్ల గ్రేటర్ విశాఖ మేయర్ గా పనిచేసిన గొలగాని హరివెంకటకుమారి పదవిని కోల్పోయారు. ఇక, డిప్యూటీ మేయర్ జియ్యాన్ని శ్రీధర్ పైన నో కాన్ఫిడెన్స్ మోషన్ సక్సెస్ చేసింది కూటమి. దీంతో మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలు ఖాళీ అయ్యాయి. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ముందుగా మేయర్ ఎలక్షన్ జరుగుతుంది. మొదటి నుంచి ప్రచారంలో వున్న పీలాశ్రీనివాస్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. ఉత్త రాంధ్ర పర్యటనలో ముఖ్యమంత్రి దగ్గరకు పీలాను తీసుకు వెళ్లిన ఎమ్మెల్యేలు ఆయన అభ్యర్థిత్వానికి ఆమోదం లభింపజేసుకున్నారు.మరోవైపు, డిప్యూ టీ మేయర్ పీఠంపై కూటమి పార్టీలు మల్లగుల్లాలుపడుతున్నాయి. మొదట్లో మేయర్ టీడీపీ, డిప్యూటీ మేయర్ జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జరిగింది. సామాజిక సమీకరణాల ఆధారంగా బీసీ గవర కులానికి చెందిన పీలా శ్రీనివా స్ కు మేయర్ ఇస్తున్నందున.. జనసేన నుంచి కాపులకు ఛాన్స్ లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అయింది. పెద్దిశెట్టి ఉష్రశీ పేరు చుట్టూ ఊహాగానాలు నడిచాయి. ఐతే, డిప్యూటీ మేయర్ విషయంలో టీడీపీ పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. హరివెంకటకుమారిపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు యాదవ సంఘాల నుంచి వ్యతిరేకత వచ్చింది. బీసీ మహిళను పదవి నుంచి తొలగించేందుకు కుట్ర చేస్తున్నారనే ఆందోళన వ్యక్తం అయింది.

# మత్స్యకారుల ఆర్థిక సాయం రెట్టింపు

● ఎన్నికల హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు ● రూ.259 కోట్లతో 1,29,178 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి ● టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే మత్స్యకారులకు లబ్ధి ● చేపల ఎగుమతుల్లో మనమే టాప్ : మంత్రి సవిత



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చేపల వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ, మరో ఎన్నికల హామీని సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చారని, మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ఆయన లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు.

ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆది నుంచి టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు మేలు జరుగుతోందన్నారు. గతంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించే వారన్నారు. మత్స్యకారుల ఆర్థిక ఇబ్బంది లను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు... గత ఎన్నికల ముందు చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేలను రెట్టింపు చేస్తూ రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రూ.259 కోట్లను అందజేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

**మా ప్రభుత్వ హయాంలోనే మత్స్యకారులకు లబ్ధి**

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత గుర్తు చేశారు. 2014లో తొలిసారిగా మత్స్యకారులకు ఆర్థియం అందించారన్నారు. ఆ నిధులతో పాటు వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా అందజేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు చేపల వేట సమయంలో ప్రాణాలు కోల్పోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్రేషియో చెల్లిస్తున్నామన్నారు. చేపల వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, ఆయా గ్రామాల అభివృద్ధికి ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిపై చిన్నచూపు చూసిందన్నారు. ఫిష్ ఆంధ్ర అంటూ రూ.300 కోట్లు ఖర్చు చేసినా, ఒక్క మత్స్యకారుని కుటుంబానికి కూడా ఎటువంటి మేలు జరగలేదని మంత్రి సవిత మండిపడ్డారు.

**చేపల ఎగుమతుల్లో మనమే టాప్**

చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రమే ముందు వరుసలో ఉందని మంత్రి సవిత వెల్లడించారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఏపీ నుంచే ఉంటోందన్నారు. మత్స్య సంపద ఎగుమతుల్లో 32 శాతం ఏపీ నుంయి జరుగుతోందన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

# తిరుమల విఐపీ బ్రేక్ దర్శనాల రద్దు అవాస్తం

● టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ
● టీటీడీ ఎలాంటి తీర్మానాలు చేయలేదు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల తిరుపతి ఆలయంలో ప్రతిరోజూ దాదావు 3000 బ్రేక్ దర్శనాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే, స్వామి వారి దర్శనం కోసం సిఫార్సు లెటర్స్ మే 1 నుండి జూన్ 30 వరకు రద్దు అని వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ ఈ విషయంపై స్పందించారు. విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు అని వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. తిరుమల తిరుపతి స్వామి వారి దర్శనం కోసం ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల సిఫార్సు లెటర్స్ రద్దుపై టీటీడీ పాలకమండలి ఎటువంటి తీర్మానం చేయలేదని స్పష్టం చేశారు. సిఫార్సు లెటర్స్ పై దర్శనాలు యధాతథంగా కొనసాగుతాయని వివరించారు. అయితే, వేసవి కాలంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం విఐపి బ్రేక్ దర్శనాలను తగ్గించడానికి, సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించడానికి ఎక్కువ స్థలాన్ని కేటాయించడానికి చర్యలు తీసుకుంటోన్నట్లు తెలుస్తోంది.

# ఉగ్రవాదమా అంతరించుమా!



దయలేని ఉగ్రవాదం
పహల్గామ్ లో మరో బీభత్సం సృష్టించింది
నిండు ప్రాణాలు బలి
ఏమి సాధిస్తారో
ఏమిటో వారి ఆశయం
ఉగ్రవాదపు బీజాలు
ఎవరో వేయనిదే మొలకెత్తవు కదా!
అసూయ ద్వేషాలతో
పగతో రగిలిపోయే
మన దాయాదుల పనే ఇది
ముక్తకంఠంతో ఖండించాలి ఈ దుశ్చర్యలను
వారణావర్తమ్ లో పాండవులను
మట్టుబెట్టాలనుకున్నాడు ఓ దుష్టుడు
సువిశాలమైన భూభాగంలో
సూదిమొనంత ఇవ్వనన్నాడు
చివరకు రక్తపుమడుగులో
విల విలలాడి కాలమైనాడు
అదేగతి పడుతుందిఇలాంటివి ప్రోత్సహించిన
దుర్మార్గులకు
ఇలాంటి ఉగ్రదాదులకు

మనలో ఐక్యత బలపడాలి
ప్రతి పౌరుడూ శివమెత్తి గర్జించాలి
అసువులుబాసిన
మన పోరాటవీరుల ఋణం తీరనిది
వీరాభిమన్యునిలా వీర మరణం పొందారు
ఓ అమ్మ కడుపు కోత తీర్చలేనిది
ఓ పడతి దాంపత్య మధురిమ
రక్తార్పణం అయ్యింది
ఆయా కుటుంబాలకు ప్రణమిల్లుదాం
అశృనయనాలతో ఆ యుద్ధ యోధులకు
వీడ్కోలు పలుకుదాం

డా వి.డి.రాజగోపాల్
9505690690

# అంతరంగ జ్యోతి, పరిసర ప్రపంచం



మన ఆలోచనలు రెక్కల్లా ఎగరాలి
ప్రతి భావనను అవి మోసుకుపోవాలి
కొన్ని స్వచ్ఛమైనవి కొన్ని మలినమైనవి
స్పందనల్లా అవి జగతిని వ్యాపించాలి
ఈ తరంగాలు అంతరాత్మలను తాకాలి
ప్రకృతిని ప్రభావితం చేయాలి
మనస్సుల్లో మంచిని పెంచాలి
జీవితాలలో వెలుగును నింపాలి
విలువలు మనకు దారిని చూపిస్తాయి

ప్రతీ నిర్ణయంలో దిశానిర్దేశం చేస్తాయి
కరుణ సత్యం మార్గం చూపిస్తే
అదే జీవితానికి అర్థం పరమార్థం
ఇతరులు విలువలు పాటించకున్నా
నువ్వు ప్రలోభాలకు లొంగకూడదు సుమా
నీ సత్యనిష్ఠను విడవకుంటే
అంతశ్శక్తి బలపడుతుంది తథ్యం
శాంతి, ఆనందం, ప్రేమ, స్వచ్ఛతలు
నీ అంతరాత్మయొక్క విలువలు
వాటి సారాంశాన్ని గ్రహిస్తే
దివ్యశక్తి నీ సొంతంబీ ఖాయం
అందరిలో అంతరాత్మ ఉంటుంది
బాహిర రూపాలకు అతీతంగా చూడాలి
హృదయంలో చైతన్యం, మనస్సులో కరుణ
శ్రేష్ఠమైన మార్గాన్ని మంచి జగతిని నిర్మిస్తాయి

– మండా వెంకట అప్పారావు
(9347589272)

# 'పా(క్)'కాసుర ఉగ్రోన్మాదం



పుల్వామా గాయాలు మాననే లేదు
పెహల్గామ్‌లో ముష్కర కుక్కల కాట్లు
కుక్కలు అంటే అవి వ్యతిరేకిస్తాయేమో
వాటికి ఉన్న అపూర్వ విశ్వాసంలో..
ఈ నరరూప రాక్షసులకు ఎక్కడుంది !
భరతమాత బోరున విలపిస్తోంది
మాతృభూమి భగ్గుమంటోంది
మతమే మరణాని కారణమయ్యింది
తలలో, గుండెలో, నోట్లో, మర్మాయవాల్లో..
అమానవీయ బులెట్లు దూసుకుపోయాయ
మానవత్వం హత్య చేయబడింది !
కాశ్మీరీ లోయలో రుధిర వరద పారుతోంది

పాక్ ప్రేరేపిత దాడి పర్యాటకులపై కాదని..
భారతమాత ఆత్మపై గుచ్చుకున్న ముళ్లని..
పాక్ పిచ్చుకపై భారత బ్రహ్మాస్త్రం పడితే..
క్షణాల్లో బూడిదైపోతామని తెలియని..
మేకపోతు గాంభీర్యం అజ్ఞాన దాయాది !
దుశ్చర్యకు ప్రతీకార ప్రతి చర్య వ్యతిరేకంగా..
వంద రెట్లు అధికంగా ఉంటుందని..
భరతమాత రౌద్రంతో కన్నెర్ర చేస్తే..
భారత సైన్యం సింహ గర్జన చేస్తే..
క్షణాల్లో దాయాది దయలేని రాక్షస దేశం..
మరుభూమిగా మారడం ఖాయం !
పాక్ పందులకు పన్నీరు అఇష్టమని..
ఉగ్రవాద కంపు మాత్రమే ఇంపు అని..
అనాదిగా అవగతం అవుతోంది
మింగ మెతుకు అసలే లేదు కాని..
తుపాకులు, తూటాలు ఉన్నాయని..
విర్రవీగితే తాను తవ్విన గోతిలో..
తానే పడే అవివేక 'పా(క్)కాసురుడు' !

మధుపాళీ
9949700037

# పుస్తకాల తోటలో (36) డా: అమ్మిన @ 77298 83223




ఖమ్మం సాహితీ శ్రీమంతుల్లో సర్వ సలక్షణ సరస్వతి తాను నమ్ముకున్న అధ్యాపక వృత్తిని అంకితభావంతో నిర్వహిస్తూ ఆదర్శవంతమైన సాహితీ సేవ చేస్తున్న సహృదయురాలు వురిమళ్ల సునంద, తాను రాయడమే కాక తన శిష్యులలోని సృజన వెలికి తీసి విభిన్న ప్రక్రియలలో రచనలు చేయించడమే కాక వాటిని పుస్తకాలుగా ప్రచురించి వాటిని భావితరాల కోసం భద్రపరుస్తున్న ఈ అక్షర సేవకి నిజమైన ఆదర్శ ఆధ్యాపకురాలు. సునంద గారి సంపాదకరత్వంలో వెలు వడిన "పూలసింగిడి" పిల్లల కథా సంకలనంలో తాను పనిచేసిన ఆళ్లపాడు పెద్దబడి పిల్లల కథలు పొందుపరిచారు, 6 – 9 తరగతుల చిన్నారి రచయితలు రాసిన బుల్లి బుల్లి కథలు ఇందులో మనం చదవవచ్చు. మొత్తం 18 కథలు వేటికవే భిన్నమైన కథా వస్తువులతో చక్కగా చెప్పబడ్డాయి, మంచి సామాజిక స్పృహతో నిండిన ఈ పిల్లల కథలు చదువుతుంటే ఔరా..!! అనిపిస్తుంది,

"ఐక్యమత్యం" లోని గొప్పతనం గురించి ఎంతో గొప్పగా చెప్పిన చిన్న కథ "మంచి మాట" ఏడవ తరగతి విద్యార్థిని ఎం అంజలి రాసిన ఈ కథలో రెండు సింహాలు కలిసి పాలన చేస్తూ తమ రాజ్యపు అడవిలోని మిగతా జంతువులకు ఐక్యతతో శత్రుత్వాన్ని ఎలా ఎదుర్కోవాలో చెప్పిన తీరు తెలియాలి అంటే ఈ కథ చదవాలి,

నీతి, నిజాయితీ, అనే మంచి గుణాలతో పాటు మనిషికి అత్యవసరమైన కృతజ్ఞతా గుణం గురించి చెబుతూ ఆ మంచి గుణాలతో రాజు అనే యవకుడు ఎలాంటి లాభం పొందాడో కళ్ళకు కట్టినట్టు చెప్పిన మంచి కథ ఎనిమిదవ తరగతి విద్యార్థిని గంగోత్రి వ్రాసిన "కృతజ్ఞత" కథ, కేవలం నీతిని చెప్పి వదిలేయకుండా దాని ద్వారా కలిగిన ఫలితాన్ని కూడా చెప్పడం పిల్లల కథల్లోని ప్రధాన అంశం, అచ్చంగా దానిని ఆవిష్కరించిన ఈ విద్యార్థిని రచనా భవిత చాలా గొప్పది అనడంలో సందేహం లేదు.

సోమరితనం వల్ల వచ్చే నష్టం కష్టపడడం ద్వారా కలిగే లాభం ఆనందం గురించి మంచి భావ స్ఫూర్తితో రాసిన కథ "సోమరితనం వద్దు కష్టించడం ముద్దు" తండ్రి బ్రతికి ఉండగా బాధ్యత లేకుండా తిరిగిన రవి సోములు తండ్రి దూరం అయ్యాక బాధ్యతలు తెలుసుకొని కష్టపడి ప్రయోజకులుగా మారిన వైనం ఈ కథలో చదవవచ్చు, 8వ తరగతి విద్యార్థి యం. సాయికుమార్ రాసిన ఈ కథలో రైతుల జీవితం కళ్ళ ముందు కదలాడే విధంగా ఉంది, కథలోని శైలి కూడా మంచి భవిత కలిగి ఉంది, కానీ ముగింపులో పిల్లల తల్లి అనాధ శరణాలయానికి వెళ్లిపోయింది అనకుండ దగ్గర బంధువుల ఇంటికి వెళ్ళింది అంటే మరింత సంతృప్తిగా ఉండేది.

ఒక్కరు గా ఉంటే రాని గొప్పతనం అందరూ కలిసికట్టుగా ఉండటం వలన వస్తుంది అనే మంచి పర్యావరణ నీతికథ "ఎవరు గొప్ప" వ్యసనాలకు బానిస అయిన రవి తన అక్క మరణంతో పశ్చాత్తాపం చెంది ఎలా మంచిగా మారాడో తెలిపి.. ఆసక్తిదాయకంగా సాగిన మంచి కథ "పరివర్తన"

మనం పడే కష్టానికి సాటివారి సాయం తప్పక లభిస్తుంది నేను నిజాన్ని చాటి చెబుతూ నిరుపేద విద్యార్థి కష్టపడి చదివి వైద్యవి విద్య నేర్చిన తీరు ఆవిష్కరించిన ఆదర్శనీయ కథ "తల్లి కోరిక"

"స్నేహబంధం" మొదలు "స్నేహం" వరకు విస్తరించిన ఈ కథల సింగిడి వస్తువుల రీత్యా నిజంగా ఏడు రంగుల ఇంద్రధనస్సు అనడంలో అతిశయం లేదు, కథలు రాయాలనే కోరిక గల పిల్లలంతా విధిగా చదవాల్సిన పుస్తకం ఈ "పూల సింగిడి".

పూల సింగిడి (బాలల కథా సంకలనం) సంపాదకులు: వురిమళ్ల సునంద, పేజీలు:40, వెల: అమూల్యం, ప్రతులకు: సాహితీ లోగిలి ఖమ్మం, సెల్: 9441815722.

# నారాయణ నామ స్మరణతో ముక్తి పొందిన అజామిళుడు

## శ్రీ మహాభాగవత కథ-32





**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**

**కంll చదివెడిది భాగవతమిది,**
**చదివించును కృష్ణు, దమృతఝరి పోతనయున్**
**చదివినను ముక్తి కలుగును,**
**చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాల' మతినై**

పూర్వం కన్యాకుబ్జపురంలో అజామిళుడు అనే పాపాత్ముడైన బ్రాహ్మణుడు ఒక దాసీదాన్ని భార్యగా చేసుకుని పదిమంది కొడుకులను కన్నాడు. కొంతకాలానికి ముసలివాడయ్యాడు. నల్లవెంట్రుకలు తెల్లబడ్డాయి. శరీర అవయవాలు పట్టుతప్పాయి. కంటిచూపు తగ్గిపోయింది. అయినా సంసారం మీద భ్రాంతి మాత్రం పోలేదు. అతడి చిన్నకొడుకు పేరు నారాయణ. వాడంటే అజామిళుడికి చాలా ఇష్టం. అతడికి మృత్యువు సమీపించింది. ఇంతలో ముగ్గురు యమకింకరులు అతడిని తీసుకుపోవడానికి వచ్చారు.

వారు అజామిళుడికి కనిపించగానే పుత్రభ్రాంతితో 'నారాయణా! నారాయణా! నారాయణా' అంటూ తన కొడుకును పిలిచాడు. అది వినగానే ఆ పరిసరాలలో వున్న విష్ణుదూతలు అక్కడికి హుటాహుటిన వచ్చారు. అజామిళుడి ప్రాణాలను లాక్కుంటున్న యమకింకరులను బలవంతంగా తోసేశారు. విష్ణుదూతలకు, యమకింకరులకు వాగ్వివాదం అయింది. అతడెలా దండించతగినవాడో చెప్పమని విష్ణుదూతలు ప్రశ్నించారు. అసలు దండనకు గురికావాల్సిన వారెవరు? కాతగని వారెవరు అనికూడా అడిగారు.

సమాధానంగా యమభటులు ఇలా చెప్పారు. "పాపపుణ్యాల నిర్ణయం జరిగి తదనుగుణంగా జీవులు శిక్షించబడుతారు. ఈ జన్మలో చేసిన పుణ్యం, పాపం ఆధారంగా వాటి ఫలాన్ని అనుభవించాలి జీవుడు. ఈ అజామిళుడు పూర్వజన్మ సుకృతంవల్ల ఈ జన్మలో బ్రాహ్మణ కులంలో జన్మించాడు. సకల వేదాలను చదివాడు. ఎప్పుడూ సత్యాన్నే పాటించాడు. మంచి గుణాలు కలవాడు. ఇంతలో యవ్వనం వచ్చింది. యవ్వన గర్వం పొడసూపింది. మీసాలొచ్చాయి. అధిక తేజస్సుతో ప్రకాశించాడప్పుడు. ఒకనాడు వనానికి పోయి తిరిగి వస్తున్నప్పుడు, ఒక పొదరింట్లో, ప్రియురాలితో ఆనందిస్తున్న విటుడి దృశ్యాన్ని చూశాడు. ఇద్దరినీ నిశితంగా గమనించాడు అజామిళుడు. మన్మథ ప్రేరేపితుడై, చిత్తం పట్టు తప్పి, సాధు లక్షణాలను వదిలిపెట్టి, దానికి బానిసయ్యాడు. అందగత్తె అయిన భార్యను వదిలిపెట్టి, వెలయాలి ఇంట్లో కాపురం పెట్టాడు. ఆ వెలయాలి కృపతో జీవించసాగాడు. ఇలా చాలాకాలం అజామిళుడు ఆ దాసీదాని కుటుంబమే తన కుటుంబంగా భావించి దుష్టవంతనుడై, పాపాత్ముడై మెలిగాడు. అందుకే చనిపోగానే ఇతడిని మేం తీసుకునిపోతున్నాం" అని అన్నారు యమభటులు.

ఇలా పలికిన యమదూతలతో విష్ణుభటులు, "మీ అజ్ఞానం మాకు అర్థమైంది. అసలు విషయం తెలుసుకోండి. ఇతడు కోటి జన్మల పాపాన్ని ఈ జన్మలో పారద్రోలాడు. మరణకాలం సమీపించేసరికి శ్రీహరి పుణ్యనామాన్ని సంకీర్తన చేసిన అదృష్టం అతడికి కలిగింది. బ్రహ్మహత్యాది పాపాలను తీసేసేది కదా హరినామ సంకీర్తనలు! బ్రహ్మాది దేవతలను కాపాడేది కదా హరినామ సంకీర్తనలు! బిడ్డకు నారాయణ అని పేరుపెట్టుకుని పిలిచినప్పటికీ, ఇతడి హృదయం పుత్రుడిమీదనే లగ్నం అయిందని అనుకోవద్దు. శ్రీపతి పేరు ఎలా పలికినా శ్రీహరి అక్కడే వుంటాడు. ఏవిధంగా శ్రీహరిని తలచినా సమస్త కలుషాలు దూరమౌతాయి. ఆర్తితో శ్రీమహావిష్ణువును స్మరిస్తే చాలు, యమధర్మరాజు బాధలు అనుభవించరు. మరణం వచ్చినప్పుడు పూర్వజన్మ సుకృతం వుంటేనే, ఏదో విధంగా నారయణుడిని స్మరిస్తారు. శ్రీహరి నామస్మరణ ఇతడు ప్రత్యక్షంగా చేశాడు కాబట్టి మీరు తీసుకుపోకూడదు" అని అన్నారు. చేసేదేమీలేక యమధూతలు అజామిళుడిని యమపాశ బంధాల నుండి, మృత్యువు నుండి విడిచి పెట్టి, యమలోకానికి వెళ్లి జరిగినదంతా యమధర్మరాజుకు చెప్పారు. అజామిళుడు సంతోషంతో విష్ణుదూతలకు మొక్కాడు. వారు కూడా అదృశ్యమై వెళ్లి పోయారు.

యమభటులు, విష్ణుదూతల మధ్య జరిగిన చర్చ విన్న తరువాత, వారు వెళ్లిపోయిన తరువాత, అజామిళుడి హృదయం సద్భక్తికి స్థానంగా నిలిచి క్షణమాత్రంలో జ్ఞానం వికసించింది. తాను చేసిన తప్పులను క్షమించమని శ్రీహరిని ప్రార్థించాడు. భార్యా బిడ్డలను, తల్లితండ్రులను వదిలిపెట్టినందుకు పశ్చాత్తాపం చెందాడు. తనలో తానే అనేకవిధాలుగా తర్కించుకుని అజామిళుడు ఒక నిర్ణయానికి వచ్చాడు. చిత్తాన్ని జయించి, ఇంద్రియాలను లొంగతీసుకుని, వాయువును కూడా నిరోధించి, శ్రీహరి దర్శనానికి ప్రయత్నించాలి అనుకున్నాడు. భవబంధాలను విడిచిపెట్టాలని, అరిషడ్వర్గాలను జయించాలని, జనన మరణాలు అనే దుఃఖ సముద్రాన్ని దాటాలని నిశ్చయించుకున్నాడు. భాగవతులతో స్నేహం చేశాడు. బంధుమిత్రులకు దూరంగా వెళ్లిపోయాడు. గంగాతీరానికి వెళ్లి అక్కడ ఒక దేవతా భవనంలో ఆసీనుడయ్యాడు. యోగమార్గాన్ని అనుసరించాడు. అప్పుడు తనను రక్షించిన దివ్యపురుషుల దర్శనం అయింది. వాళ్లకు మొక్కాడు. ఆనందంతో పొంగి పోయాడు. గంగాతీరంలో శరీరాన్ని విడిచిపెట్టాడు. మరుక్షణమే విష్ణుసేవకులతో కూడి బంగారు విమానాన్ని ఎక్కాడు. వైకుంఠానికి వెళ్లాడు. ఇలా, అనేక పాపాలు చేసినప్పటికీ, అంత్యకాలంలో 'నారాయణా!' అని పిలిచినంత మాత్రాన ముక్తుడయ్యాడు.


అజామిళుడిని మృత్యు బంధం నుండి విడిపించి, యమలోకానికి వెళ్లి జరిగినదంతా ఆయన భటులు యమధర్మరాజుకు వివరించాక, విష్ణుదూతలు ఆయన ఆజ్ఞ జవదాటవచ్చా అని తమ రాజును అడిగారు. ఆయనకంటే కూడా గొప్పవారు వున్నారా? అని ప్రశ్నించారు.

జవాబుగా యమధర్మరాజు, "నాకంటే అన్యుడైన ఘనుడు ఒకడున్నాడు. అతడు బయటకు కనపడకుండా విశ్వమంతా లీనమై సమగ్రస్ఫూర్తితో మహాద్భుతంగా వుంటాడు. అతడి ఆజ్ఞానుసారం జీవులు బంధించబడి ప్రవర్తిస్తూ వుంటారు. అతడినే నేనూ నిత్యం జపిస్తాను, స్మరిస్తాను, భజిస్తాను. నేను, మహేంద్రుడు, వరుణుడు, అగ్ని, నైఋతి, వాయుదేవుడు, సూర్యుడు, చంద్రుడు, బ్రహ్మ, మరుత్తులు, మహేశ్వరుడు, రుద్రవర్గం, సిద్ధులు.....అందరం కూడి కూడా ఆయన స్వరూపాన్ని కనుగొనజాలం. పరమేశ్వరుడు ఆద్యంతాలు లేనివాడు. ఆయన భగవంతుడు, భక్తలోకపాలకుడు. లెక్కలేనంత మంది విష్ణుదూతలు కేశవుడిని స్మరించే వారిని రక్షించడానికి అన్ని చోట్లా చరిస్తూ వుంటారు. ఎవరు కూడా భగవ్త్ తత్త్వాన్ని గుర్తించలేరు. మహాద్భుతమైన వైష్ణవ జ్ఞానాన్ని, భాగవత ధర్మాన్ని బహుశా, శివుడు, బ్రహ్మ, కార్తికేయుడు, కపిల మహర్షి, నారదుడు, భీష్ముడు, మనువు, బలిచక్రవర్తి, జనక మహారాజు, ప్రహ్లాదుడు, శుక మహర్షి, వేదవ్యాసుడు అనే పన్నెండు మంది తప్ప ఇతరులెవ్వరూ తెలుసుకోలేరు. కాబట్టి మీరు విష్ణు భక్తుల జోలికి వెళ్లవద్దు. భక్తి యోగమే ముక్తి యోగమని భావిం చేవారిని, వారికి సన్నిహితంగా మసలే వారిని మీరు కన్నెత్తి కూడా చూడవద్దు" అని చెప్పాడు.

అప్పటి నుండి యమభటులు వైష్ణవ భక్తులను తేరిపార చూడడానికి కూడా భయపడుతారు. పరమ రహస్యమైన ఈ ఇతిహాసాన్ని పూర్వం విజ్ఞానవేత్త అయిన అగస్త్య మహర్షి శుక మహర్షికి చెప్పాడు.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం, రామకృష్ణ మఠంప్రచురణ ఆధారంగా)**

# బాలల విజ్ఞాన విపంచి ఏరా..! చిప్ దొబ్బిందా..?




పుల్లా రామాంజనేయులు గారి 3వ నవల "ఏరా! చిప్ దొబ్బిందా..?". ఈ నవలకు తగినట్లే ఈ పుస్తక ముఖ చిత్రం కూడా విజ్ఞానపు వెలుగులను విరజిమ్ముతూ ఉంది. పుల్లారామాంజనేయులు గారి ప్రతి నవలలోను ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది.ఈ నవలలో సమాజంలో తన చుట్టూ ఉండే వ్యక్తులను, ముఖ్యంగా తను పనిచేసే పోలకల్ గ్రామంలోని హైస్కూల్ లోని వ్యక్తు లను, కరోనా సమయంలో ఎందరో అభాగ్యులకు ఆపన్న హస్తం అందించిన సోనూ సూద్ గారిని, తన పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను పాత్రలుగా చేసి, కొన్ని యథార్థ సంఘటనలకు, తన అద్భుత మేధా సంపత్తితో వినూత్న కల్పనలను జోడించి, విజ్ఞానాత్మక, వినోదాత్మక, ప్రయోగాత్మక, ప్రబోధాత్మక నవలగా మలిచారు.తెలుగు ఉపాధ్యాయిని పాత్ర ద్వారా రెండు చక్కని కథలను తెలియజేశారు. వృద్ధాప్యంలో ముసలివారైన తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలని, వారిని ఆశ్రమాలలో వదిలి వేయరాదని, తల్లి దండ్రులు ప్రత్యక్ష దైవాలని తెలియజేశారు. తల్లిదండ్రులను చెట్టుతో పోల్చి చెప్పడం ఎంతో బాగుంది. ఎందుకంటే త్యాగానికి మారు పేరు తరువులు. తల్లి దండ్రు లు కూడా తరువులలాగే తమ సర్వస్వాన్ని బిడ్డల కోసం ధార పోస్తారు.తల్లిదండ్రుల పట్ల మన బాధ్యతను గుర్తుచేస్తూనే పర్యావరణాన్ని సంరక్షించడానికి చెట్లను నాటమని కూడాచెప్పారు.

ఈ నవలలో ప్రధాన పాత్ర మురళి. మురళి నెలరోజులకు పైన ఎవ్వరికీ కనిపించకుండా పోయాడు. కొడుకు కనిపించకుండా పోతే ఆ తల్లి పడే బాధ అం తాఇంతా కాదు. కొడుకు ఏమైనాడో తెలియక మురళి తల్లి విలవిలలాడిపోయింది. నెల తర్వాత తిరిగి వచ్చిన కొడుకును చూసి సంతోషపడింది. తిరిగి వచ్చిన మురళిలో చాలా మార్పు వచ్చింది. దీనికి కారణం భారత ప్రభుత్వం తన ప్రయోగంలో భాగంగా మురళి మెదడులో చిప్ అమర్చడమే. మురళికి తెలియకుండా చిప్ పనితీరును పర్యవేక్షించడానికి ప్రభుత్వం ఇద్దరు అధికారులను కూడా నియమించింది.

తన మెదడులో చిప్ అమర్చిన సంగతి తెలియని మురళికి 'నేను మనసులో అనుకోగానే నాకు అన్ని విషయాలు తెలుస్తున్నాయి. నేనేమైనా దయ్యానినా..? లేక దేవుడినా..? అనే సందేహం కలుగుతుంది. అన్ని ప్రశ్నలకు జవాబు చెప్పగలుగుతున్నా కాబట్టి నేనొక హ్యూమన్ మ్యాన్ ను, వరల్డ్ నాలెడ్జ్ మ్యాన్ ను అని అనుకుంటాడు. సైన్స్ టాలెంట్ టెస్ట్ లో జిల్లా స్థాయిలో ఫస్ట్ వచ్చాడు. పాఠశాలలో పరీక్షలన్నీ బాగా రాసి, క్లాస్ ఫస్ట్ వస్తున్నాడు. ఉపాధ్యాయులు ఏ ప్రశ్న అడిగినా ఒక్క నిమిషము ఆలోచించి జవాబులు చెప్పేస్తున్నాడు. ఏ పుస్తకాలు చదవకుండానే అన్ని విషయాలు మురళికి తెలుస్తున్నాయంటే అతనికి ఆ పరిజ్ఞానం పుట్టుకతో వచ్చి వుంటుందని ఆలోచిస్తాము. కాని మురళి మెదడులో చిప్ అమర్చి ఉంటారనే విషయం మన ఊహకు అందదు. నవలను ఆద్యంతం చదివాకే మనకు ఈ విషయం బోధపడుతుంది.మనిషి శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించాడు. చిప్ అమర్చి మర మనిషి (రోబో) లను తయారు చేసి, అనేక రంగాలలో వాటితో పని చేయిస్తున్నాడు. అయితే శాస్త్ర వేత్తలు చేయలేని పనిని ఈ నవలలో పుల్లా రామాంజనేయులు గారు చేశారు. కాదేదీ కవిత కనర్హం అన్నట్లు, కాదేదీ రచన కనర్హం అనేలా గొప్పగా నవలను చిత్రీకరించారు. ఒక సజీవ మానవుని(మురళి)లో చిప్ అమర్చి , ఒక రచయిత తలచుకుంటే ఏదైనా సాధ్యమే అని నిరూపించారు

ఈ నవల ద్వారా మనకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. పాము కాటుకు ఆంటీవెనమ్ ఇంజక్షన్ ఇవ్వాలని తెలుస్తుంది. సూర్యుడు, గ్రహాల గురించి, ఏ.టి.యం పనితీరు, జాగ్రత్తల గురించి, ఆసుపత్రుల్లో కనిపించే ప్లస్ గుర్తు గురించి తెలుసుకుంటాము. గుడ్డులో ఎన్ని పోషకాలు ఉన్నాయో తెలుస్తుంది. దీనివల్ల గుడ్డు తినని వారు కూడా గుడ్డు తినడం ప్రారంభిస్తారు. ప్రధానోపాధ్యాయురాలు,ఉపాధ్యాయుల పాత్రల ద్వారా ఎంతో విలువైన సందేశాలను విద్యార్థులకు అందించారు. ప్రణాళికతో చదవాలని, అన్ని రంగాలలో ఇతరులతో పోటీపడాలని, ఓటమి వచ్చిందని ఆగిపోరాదని, ఓటమి గెలుపుకు నాంది కావాలని, సమస్యలు గాలి లాంటివని, సంకల్ప బలం ఉంటే దేనినైనా సాధించవచ్చని ఇలా ఎన్నో మంచి విషయాలను రచయిత నవలలో తెలియజేశారు. గ్రామాలలోని మనుషుల మధ్య ఆత్మీయత, అనురాగాలను, రైతుల కష్ట నష్టాలను కూడా తెలియ చేశారు. మధ్యలో జోక్స్ తో నవ్విస్తూ ,పుస్తక పరిచయాలు చేస్తూ పాఠకులను ఉత్తేజపరిచారు. మురళికి చిప్ అమర్చడం వల్ల కీడు కంటే మేలే ఎక్కువగా జరిగింది. మురళి తన పరిజ్ఞానాన్ని చెడుకు కూడా ఉపయోగించాడు. ఏ.టి.యం. నుండి డబ్బు దొంగిలించాడు. దొంగతనం చేయడం నేరం. ఇది తెలుసుకున్న మురళి, డబ్బు మళ్ళీ బ్యాంకుకు చెల్లించి, తన తప్పును దిద్దుకున్నాడు. మనం నిత్య జీవితంలో సెల్ ఫోన్, ట్యాబ్ వంటి ఎన్నో ఆధునిక, సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నాం. వాటి వల్ల మంచి,చెడులు జరగడం అనేది వాటిని మనం వినియోగించే తీరును బట్టి ఉంటుంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం మంచికే వినియోగించాలని రచయిత చక్కగా ప్రబోధించారు.


'మీలో ఎవరు కోటీశ్వరుడు' అనే ప్రోగ్రామ్ ను తలపించేలాగా 'మీలో ఎవ్వరు విజ్ఞాని' కార్యక్రమం ఎంతో బాగుంది. ఇందులో అడిగిన ప్రశ్నలు కూడా విభిన్నంగా ఉన్నాయి. ఇవి అందరూ తెలుసుకోవలసినవి. ఈ కార్యక్రమంలో పాల్గొని మురళి కోటి రూపాయలు గెలుచుకున్నాడా? లేదా? అనేది నవల చదివితే తెలుస్తుంది.

భారతదేశం మురళిని తన ప్రయోగం కోసం ఎన్నుకోవడం మురళి అదృష్టమనే చెప్పాలి. ఈ విధంగా మురళి దేశ సాంకేతిక పురోభివృద్ధిలో భాగస్వామి అయ్యాడు. దేశభక్తుడయ్యాడు. ఈ ప్రయోగంలో భారతదేశం 100 శాతం విజయం సాధించి టెక్నాలజీలో ప్రపంచంలో ప్రథమస్థానంలో నిలిచింది.ఈసారి తల్లి అనుమతితో మురళిని తీసుకొనిపోయి మురళి మెదడులో అమర్చిన చిప్ ను తొలగించారు. 40 రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు మురళి. ఎస్.ఏ.త్రీ పరీక్షలో మెదడు నుండి ప్రశ్నలకు జవాబు రాలేదు. దాంతో మార్కులు తక్కువ రావడంతో స్నేహితులు మురళిని 'ఏరా! చిప్ దొబ్బిందా..?" అని ఎగతాళి చేశారు. బాధపడుతున్న మురళిదగ్గరకురామాంజిసార్ వచ్చి, నీ స్నేహితులు కాకతాళీయంగాఅన్నప్పటికి అదే నిజమని, భారతప్రభుత్వం తన ప్రయోగంలో భాగంగా నీ మెదడులో చిప్ అమర్చిందని,ప్రయోగం పూర్తి కావడంవల్ల దానిని తొలగించిందనిచెప్పారు. దాంతో తనకు అంత తెలివి ఎలా వచ్చిందో అర్థమయింది మురళికి. ఇప్పుడు నీ మెదడులో చిప్ లేకపోయినా సెల్ ఫోన్, ట్యాబ్ ల ద్వారా ఏఐ టెక్నాలజీని ఉపయోగించి, రోజుకు 5,6గంటలు చదివితే, మరలా నీవు నాలెడ్జ్ మ్యాన్ కావచ్చు అని ధైర్యం చెప్పారు. ఈ నవల ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతి ఒక్కరూ చదువవలసిన అత్యద్భుత నవల ఇది. ఇంత గొప్ప నవలను మనకందించిన పుల్లారామాంజనేయులు గారికి నా హృదయ పూర్వక అభినందనలు.

పుస్తకాలు దొరుకు చోటుః పుల్లారామాంజనేయులు, కర్నూలు, 9491851349 పేజీలు: 132 ధర:160

**పుస్తక సమీక్ష: మారంరెడ్డి నాగేశ్వరమ్మ,918179950667**

# బలహీన ప్రేమ




ప్రేమకు జీవితంలో ప్రాధాన్యత ఉండటం మంచిదే అయినా, మనిషి తన ఉనికి గురించి, ఆ ప్రేమ ఉన్న సందర్భం పరిస్థితుల గురించి ఎల్లప్పుడూ ఆలోచన కలిగి ఉండటం కూడా అంతే ముఖ్యం. స్త్రీ తన జీవితంలో ప్రేమకు బలహీనురాలు అయితే అదే బలహీనత ఆమెను ఎలా జీవితంలో పతనం చెందేలా స్పష్టం చేసే నవలే అనురాధ గారి 'ఆడదంటే ..?సబల' నవల. ఈ నవల ఆంధ్రభూమిలో సీరియల్ గా ప్రచురించబడింది.

ఈ నవలలో మూడు ముఖ్య పాత్రలు. అవి మాధవి, మధురిమ,మధుకర్. మాధవి మేనత్త కొడుకు మధుకర్. వీరిద్దరికి వివాహమవుతుంది. మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన మధుకర్ కు ఇంకా ఎంతో సాధించాలని, ఆర్థికంగా ఎంతో ఎదగాలని కోరిక. మాధవి తల్లిదండ్రులు గాయత్రి, సుబ్బారావు. మాధవి పల్లెటూరి వాతావరణంలో పెరిగింది. పెళ్లయ్యాక హైదరాబాద్ కు నివాసం మారింది. మాధవి దంపతులకు లాలిత్య, నవీన్ సంతానం. పెళ్ళయిన మొదటి నుండే వ్యాపారం పనుల మీద ఎక్కువ శాతం ఇంట్లో ఉండేవాడు కాదు మధుకర్. మధుకర్ తండ్రి మరణించినా, గాయత్రి తల్లి మరణించినా సరే మధుకర్ పెద్దగా బాధ పడకపోవడం, ముభావంగా ఉండిపోవడం అటు తల్లి పద్మకు, ఇటు భార్యకు అదోలా అనిపించినా ఆ బాధలో లోతుగా దాని గురించి ఆలోచించలేదు.

మధుకర్ తల్లి అన్న సుబ్బారావు గారి దగ్గరకు ఉండటానికి వెళ్తుంది. అదే సమయంలో తను ఎప్పుడూ బిజినెస్ పనుల మీద తిరుగుతూ ఉంటాడు కనుక భార్యాబిడ్డలను కూడా అదే పల్లెటూరిలో ఉండేలా చేస్తాడు మధుకర్. అతను బాంబే లో ఫార్మాసూటికల్ కంపెనీ పెట్టాక తెలివైన మధురిమను చూస్తాడు. మధురిమ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చింది. ఆమె తల్లిదండ్రులు టీచర్లు.ఆమె అక్క కూడా టీచర్ గానే పని చేస్తుంది. మధ్యతరగతి కుటుంబంలో పుట్టడం వల్ల,విలాసవంతమైన జీవితం గడిపే అవకాశం లేకపోవడం వల్ల ఆమెను ఆ రకం జీవితం కొంత అబ్బురపరుస్తూ ఉంటుంది. మధురిమను తన కంపెనీలోకి తీసుకుంటాడు మధుకర్. ఆమె తెలివితేటలు గమనించిన మధుకర్, ఆమె తన కంపెనీ కోసం మాత్రమే అంకిత భావంతో పని చేయాలం టే ఆమెను ప్రేమ ఉచ్చులో బిగించడమే మంచి మార్గమని భావిస్తాడు. మధురిమను వివాహం చేసుకుంటానని అంటాడు. సంతోషంతో ఒప్పుకుం టుంది మధురిమ. ఆ పెళ్ళిని రహస్యంగా ఉంచడం, కంపెనీలో కూడా ఎవరికి తెలియకుండా జాగ్రత్త పడటం,ఆ పెళ్ళికి సాక్ష్యాలు లేకుండా చూడటం వంటి అంశాలను గురించి మధురిమ లాంటి చదువుకున్న మరియు తెలివైన స్త్రీ కూడా ఆలోచించకుండా చేస్తాడు మధుకర్. ఆమెను కేవలం హోటల్స్ కు తప్ప ఎప్పుడు ఫంక్షన్స్ కు తీసుకువెళ్ళేవాడు కాదు. ఆమెతో ఎటువంటి ఫోటోలు లేకుండా జాగ్రత్త పడే వాడు. ఆమెను ఎప్పుడు ఓ ఉద్యోగిగానే చూసేవాడు.ఆమెకు ప్రతి నెలా జీతం అందరిలానే ఇచ్చేవాడు.ఆ తర్వాత తన కంపెనీ ఎదగడానికి మీటింగ్స్ పేరిట కొందరిని ఇంటికి తీసుకురావడం,ఆ సమయంలో మధురిమ చేత విస్కీ తాగించడం, ఆ తర్వాత ఆమెకు మత్తుగా ఉండటం, ఉదయానికి ఆమెకు ఏం జరిగిందో గుర్తుండకపోవడం జరుగుతూ ఉంటుంది.


అలా కొన్నాళ్ళు జరిగాక మధురిమకు అనుమానం వస్తుంది.డాక్టర్ ను కలిశాక మరి కొన్ని విషయాలు కనుకున్నాక ఆమెకు మధుకర్ ఆమెకు విస్కీలో రేప్ డ్రగ్స్ వాడటం వల్ల తనకు మత్తుగా ఉండేదని,ఆ సమయంలో తన బిజినెస్ విస్తరించుకోవడానికి ఆ వ్యక్తులకు తనను అప్పగించేవాడని, ఈ డ్రగ్ వాడకం వల్ల తాను మాతృత్వానికి దూరమయ్యానని ఆమెకు స్పష్టం అవుతుంది. మధుకర్ కు ఎలా అయినా శిక్ష పడాలని భావించిన ఆమె తర్వాతి సారి వ్యక్తి వచ్చినప్పుడు దానిని సాక్ష్యంగా మలుచుకుంటుంది.

అతని మీద కేసు పెడుతుంది. మీడియా ద్వారా ఆ విషయం అందరికీ తెలిసిపోతుంది. మధుకర్ అరెస్ట్ అవుతాడు.ఇది తెలుసుకున్నాక మాధవి తన భర్త వల్ల మోసపోయిన మధురిమ దగ్గరకు వెళ్ళి తన గురించి చెప్పి ఆమె గురించి మొత్తం తెలుసుకుంటుంది. ఓ భార్యగా కాకుండా స్త్రీగా ఆలోచించిన ఆమెకు భర్త చేసిందే తప్పుగా అనిపిస్తుంది. ఆమె కూడా మధురిమనే సపోర్ట్ చేస్తుంది. భర్త జైలులో ఉన్న సమయంలో మధురిమ సహకారంతో ఆ కంపెనీ తానే నడుపుతుంది మాధవి. మొత్తానికి మధుకర్ కి పదేళ్ళు శిక్ష పడుతుంది. మధుకర్ మొత్తానికి తాను చేసింది తప్పని తెలుసుకుంటాడు. ఆ తర్వాత కొన్నేళ్లకు మధురిమ ఆశ్రమ జీవితం గడుపుతుంది. మాధవి కుటుంబ బాధ్యతలు తీసుకుంటుంది.

స్త్రీ ఎమోషనల్ గా భార్యగానో, ప్రేమించిన వ్యక్తిగానో మాత్రమే ఆలోచించే దశలోనే ఉండిపోతే ఆమె ఎప్పటికీ అబలగానే ఉండిపోతుంది. ఆమె ఆ దశ దాటి తార్కికంగా, ఎదుటి వ్యక్తి ప్రేమ–అభిమానం వెనుక ఉండే స్వార్థాన్ని గమనించగలిగే యుక్తిని ఎప్పుడూ ప్రేమ వల్ల కోల్పోకూడదు. అలా ఉంటే,ఆ ప్రేమ ఆమెకు బలహీనతే తప్ప బలం కాదు.ప్రేమ–పెళ్ళి పవిత్రమైనవే అయినా,ఆ పవిత్రత స్త్రీ పురుషులిద్దరికి వర్తించే అంశమే తప్ప స్త్రీ మాత్రమే దానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. స్త్రీ తన సామర్థ్యాన్ని ఎప్పుడూ తక్కువ అంచనా వేసుకోకూడదు. ఎదుటి వ్యక్తికి దాసోహం అనకూడదు. అటువంటి స్థితిలో ఆమె తన వ్యక్తిత్వాన్ని కూడా కోల్పోతుంది. తనలోని సున్నితత్వాన్ని అవసరమైతే కొంత కఠినంగా మార్చుకోగలిగితేనే ఆమె సబలగా మరగలదు.

**తేజస్వి - హైదరాబాద్**

## "అంతరంగ యుద్ధం ఈ కవిగారి అంతరంగాలు"




హోలికులు, ఆల్కహోలికులు కలిస్తేనే కవిలోని కవిత్వం జనిస్తుందని"పి. చంద్రశేఖర ఆజాద్" గారు అన్న మాటల్లో నిజం లేదని మనం అనలేం. అలాఅని అందరు కవులు, కళాకారులు ఆల్కహోలికులు కాదు. మత్తు ఏ రకంగానైనాకలగవచ్చని వీరి ఉద్దేశ్యం. అక్షరం మత్తు, మద్యం మత్తుకి ఏదో అవినాభావసంబంధముందని మనం ఊ కొట్టక తప్పదు. "కవిగారి అంతరంగాలు" అనిరాసిన పుస్తకంలో "పి.చంద్రశేఖర ఆజాద్" గారి మానసిక సం'ఘర్షణ తనఅనుభవాల సారాన్ని మ్నెత్తంగా కాస్త కుదించి ఈ పుస్తకంలో చెప్పినట్టుగాఅనిపించింది. నిజాన్ని ఒప్పుకోవడానికి చాలా గుండె ధైర్యం కావాలి. ఏడు పదులవయసులో కూడా తనకు కవిత్వ మూలాలు ఇదమిద్ధంగా ఇప్పటికి తెలియదనిచెప్పడంలోనే ఆయన కవిత్వాన్ని ఎంతగా ఇష్టపడుతున్నారో మనకు అర్థంఅవుతోంది. ఏదైనా రాతను కాని, మనిషిని కాని విమర్శించడం క్షణాల్లో పని. కానిఆ విమర్శ సహేతుకమైనదా కాదా అన్నది వారి వారి నైజాలనుబట్టి వుంటుంది. వీరు "కవిగారి అంతరంగాలు" అని రాసినా ఇది అందరూ ఒప్పుకోవాల్సిననిజాయితీ రచన. దీనిలో ప్రతి వాక్యమూ ఆనాటి నుండి ఈనాటి వరకు వాస్తవచరితే.

అక్షరం మత్తు కొందరిని దిగజారుస్తుంది, మరికొందరిని చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలుపుతుంది. సామాజిక,ఆర్థిక అసమానతల నుండి, రాజకీయ పరపతి, ఇంకా ఇతర వ్యవస్థల్లో పేరుకుపోయిన లోపాలను, వాటి ప్రభావంతోసాహిత్య లోకంలో జరుగుతున్న లొసుగుల ముసుగులను చాలావరకు ఈపుస్తకంలో ప్రస్తావించారు. సమాజంలో కులమతాల కుతంత్రాలను, అవార్డుల, రివార్డుల అభిజాత్యాలను ఎత్తి చూపించారు. సాహిత్య సంస్థలు, సమూహాలు, భజన బృందాలు వగైరా వగైరాలన్నీ మనకు తెలిసినా మనం ఒప్పుకోలేనినిజాలనన్నింటిని ఈ పుస్తకంలో చూపించారు.కవిత్వంలోనే కాదు, రాజకీయాల్లోనే కాదు, జీవితంలో మనం చేసిన తప్పుల గురించి, మనం సృష్టించిన సృజన గురించి మాట్లాడుకోవాలి. మరిన్ని తప్పులుచేయకుండా జాగ్రత్త పడాలి." ఈ మాటలతోనే ఈ కవిగారి అంతరంగం మనకుసు స్పష్టంగా తెలిసిపోతోంది. ఇంత నిజాయితీగా, ధైర్యంగా జరిగినవి జరిగి నట్టుగాప్రతి విషయాన్ని, ఎవరేమనుకుంటే నాకేంటి అన్నట్టుగా అక్షరాల నక్షత్రాలనుమనసు వెన్నెల్లో మనమూ చదివేటట్లుగా రాసి'పోశారు. ఎవరు ఏది ఎలాఏరుకుంటారో అది మీ ఇష్టం అని మనకే వదిలేసారు.

**"మన సిద్ధాంతాలకంటే జీవితం శక్తివంతమైనది.**
**సైలెంట్ గా తన పని తాను చేసుకుపోతుంటుంది."**

ఈ మాటలు కాదని అనగలమా! సిద్ధాంతమైనా, రాద్ధాంతమైనా అసలు జీవితమంటూ మనకుంటేనే కదా! ఇవన్నీ వచ్చేది. కథలు, నవలలు ఇతరరచనలు ఎక్కువగా రాసినా, తనకు ఇష్టమైన కవిత్వం తక్కువ రాసినా, ఆ కవిత్వంనుండే తాను ప్రేరణ పొందానని సగర్వంగా చెప్పుకున్నారు. తాను ఒకప్పుడుచేయలేని పనిని కూడా నిజాయితీగా ఒప్పుకుంటూ, ఈ రచన వెలువడినప్పుడుకురిసిన విమర్శల వర్షానికి కూడా వినమ్రంగానే సమాధానం చెప్తూ, "మన శత్రువువెవరో తెలుసుకుంటే ఆ కృషి ఫలవంతమౌతుందని" సోదాహరణం గావివరించారు. ఈ పుస్తకం చదివిన తర్వాత ఈరోజుల్లో అవార్డులు రాకపోవడమేఉత్తమ రచనకు తార్కాణం అన్న నిజం మనకు అర్థం అవుతుంది.జీవితంలో నిజాన్ని ఒప్పుకునే ధైర్యం వున్న ప్రతి ఒక్కరూ తప్పకచదవాల్సిన పుస్తకాన్ని తెలుగు సాహిత్యానికి ధైర్యంగా అందించిన "పి.చంద్రశేఖర్ ఆజాద్" గారికి హృదయపూర్వక అభినందనలు.

**మంజు యనమదల**
**9490769585**

# మతం రంగులో మృత్యువు!

ఇపుడిపుడే కాస్త ఊపిరి
పీల్చుకుంటున్న ఆ నేలలో
మళ్ళీ అలజడి బీజాలు
నాటాడు వాడు.
ఆ నేల ఋతు రాగాలు
పాడితే వాడికి కంటగింపు.
పచ్చని లోయలో రక్తం చిందించి
వెచ్చగా చలికాచుకోవడం
వాడికి అలవాటు.

కల్మషమంటని లేత ప్రాయం
కొత్త జంటల కలల గీతం
ధర్మపత్నుల ఆర్తనాదం
ఎదురు చూపుల బేలతనం
ఏవీ వాడి కరకు గుండెను
కరిగించలేక పోయాయి.
తెల్లని హిమముకు
రక్తపు మరకలు అంటించడమే
వాడికి తెలిసిన విద్య.

పహల్గాం ఒడిలో
ఆదమరచి సేదతీరే
ఆ తనువులకేం తెలుసు
మృత్యువు ముష్కర మూకల
కపట సైనిక వేషంలో
మతం రంగు పులుముకొని
వస్తుందని?
ఐనా! మతం పునాదులపై
ఇల్లు కట్టుకున్న వాడు
పర మతమునెలా సహించగలడు?

గిల్లికజ్జాల దాయాదికి
నాల్గుమార్లు ఓడినా
వాడి మెట్ట మెదడులో బుద్ధి
మొలవలేదు
ఈ సారి వాడి పీచమణిగేలా
గట్టిగా కొడితేనే గాని వాడి నీచ
బుద్ధి మారదు!
కల్లోల కాశ్మీరం
గర్భశోకం తీరదు!!

**సింగారపు రాజయ్య (సిరా)**
**9945744332**

## "48 గంటల్లో పొలాలు ఖాళీ చేయాలి".. సరిహద్దు రైతులకు బీఎస్ఎఫ్ ఆదేశం




పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధమేఘాలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) సరిహద్దుల్లోని రైతులకు కీలక ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా మారింది.
సరిహద్దు వెంబడి ఉన్న రైతులు 48 గంటల్లో పంట కోత పూర్తి చేసి తమ పొలాలను ఖాళీ చేయాలని శనివారం బీఎస్ఎఫ్ అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. పెరిగిన భద్రతా చర్యల వల సరిహద్దు కంచె, జీరో లైన్ మధ్య ఉన్న సున్నితమైన జోన్‌లోని వ్యవసాయ భూమిని కలిగి ఉన్న రైతులు పొలాలను ఖాళీ చేయాలని అడిగారు. దీని వల్ల వేల మంది రైతులపై ప్రభావం పడుతుంది. 530 కి.మీ అంతర్జాతీయ సరిహద్దులో సుమారు 45,000 ఎకరాల సాగుపై ప్రభావం పడుతుంది.
ముఖ్యంగా ఇది పంజాబ్ రైతులకు సవాల్‌గా మారింది. అమృత్‌సర్, తర్న్ తరణ్, ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా జిల్లాల్లోని ఈ వ్యవసాయ ప్రాంతాలకు త్వరలో ప్రవేశం మూసివేయబడుతుందని, పరిస్థితి మరింత దిగజారితే వారి భూములకు నిరవధికంగా ప్రవేశం నిలిపేస్తామని గ్రామాల గురుద్వారాల ద్వారా హెచ్చరికల ప్రకటనలు చేశారు.
ఈ పరిస్థితిపై సరిహద్దు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారుర. పశుగ్రాసం తమ పశువులకు చాలా అవసరమని, శాంతి ఉన్నంత వరకు తాము పని చేయడానికి అనుమతించాలని రైతులు కోరుతున్నారు.
ఇటీవల వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో గోధుమ కోత ఇప్పటికే ఆలస్యమైంది. ఈ పరిస్థితుల్లో ఈ ఆదేశాలు వచ్చాయి. అయితే, రైతులు ప్రయోజనాలను మేము అర్థం చేసుకున్నామని, దీని కన్నా దేశ ప్రయోజనాలు, భద్రత ముఖ్యమని బీఎస్ఎఫ్ అధికారులు చెబుతున్నారు. పంటల వల్ల గస్తీకి ఇబ్బందులు కలగకుండా బీఎస్ఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది.


# కశ్మీర్ అభివృద్ధిని ఓర్వలేకే ఉగ్రదాడి



- మన్‌కీ బాత్ 121వ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని
- డా.కె.కస్తూరిరంగన్ గారికి చాలా వినమ్రంగా నివాళులు
- ఉగ్రదాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు
- దాడికి పాల్పడిన వారికి అత్యంత కఠినమైన శిక్షలు
- ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నవారి వెన్ను విరుస్తామని హెచ్చరిక
- పహల్గాం ఘటనపై ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమం 121వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు.
ఈ దాడి తనను ఎంతగానో కలచివేసిందని.. ప్రతి భారతీయుడు కోపంతో రగిలిపోతున్నాడని అన్నారు. దేశంలో ఎన్నో మతాలు, కులాలు, భాషలు ఉన్నప్పటికీ.. ప్రజలంతా బాధితులకు అండగా నిలిచారని.. ఇదే భారత్‌లో ఉన్న గొప్పదనమని కీర్తించారు. జమ్మూకశ్మీర్ సాధిస్తున్న అద్భుత పురోగతిని చూసి ఓర్వలేకే.. ఉగ్రవాదులు అమాయకులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.
"జమ్మూ కశ్మీర్‌లో శాంతిని స్థాపించేందుకు భారత ప్రభుత్వం కృషి చేస్తోంది. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకుంటున్నాయి. యువత ఉద్యోగాల వైపు వెళ్తున్నారు. ప్రజాస్వామ్యం బలపడుతోంది. పర్యాటకం పెరుగుతోంది. ఇదంతా చూసి మన శత్రువులు ఓర్చుకోలేకపోయారు. కశ్మీర్‌ను మరోసారి నాశనం చేయాలనుకున్నారు" అని మోదీ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని.. దాడికి పాల్పడిన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధిస్తామని ప్రధాని పునరుద్ఘాటించారు.
ఉగ్రవాదంపై చేస్తున్న యుద్ధంలో దేశ ఐక్యత, 140 కోట్లమంది ప్రజల మద్దతు భారత సైన్యానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. మనలో ఉన్న ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ దాడిని భారత ప్రజలు ఒకే గొంతుతో వ్యతిరేకించడాన్ని ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయన్నారు.
భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. దేశంలో ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయాల్సిన సమయం వచ్చిందని మోదీ అన్నారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వారిని బయటకు లాగుతామని.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నవారి వెన్ను విరుస్తామని హెచ్చరించారు.
యువతకు కొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయి. దేశ శత్రువులు, జమ్మూ కాశ్మీర్ శత్రువులకు అది నచ్చలేదు. కాశ్మీర్ ను మళ్లీ నాశనం చేయాలని ఉగ్రవాదులు, ఉగ్రవాద సూత్రధారులు కోరుకుంటున్నారని, అందుకే ఇంత పెద్ద కుట్రను అమలు చేశారన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరులో దేశ ఐక్యత, 140 కోట్ల మంది భారతీయుల సంఘీభావం మన అతిపెద్ద బలం.
ఈ ఐక్యత ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఆధారం. దేశం ముందు వచ్చిన ఈ సవాలును ఎదుర్కోవడానికి మనం మన సంకల్పాన్ని బలోపేతం చేసుకోవాలి. ఒక దేశంగా మనం దృఢ సంకల్ప శక్తిని ప్రదర్శించాలి. నేడు ప్రపంచం చూస్తోంది, ఈ ఉగ్రదాడి తర్వాత దేశం మొత్తం ఒకే గొంతులో మాట్లాడుతోందన్నారు.
ఈ ఉగ్రదాడి తరువాత, ప్రపంచం నలుమూలల నుండి నిరంతరం సంతాపాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ నాయకులు నన్ను కూడా పిలిచారుబీ లేఖలు రాసి సందేశాలు కూడా పంపారు. ఈ దారుణమైన ఉగ్రదాడిని అందరూ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు వారు సంతాపం తెలిపారు.
ఉగ్రవాదంపై పోరాటంలో ప్రపంచం మొత్తం 140 కోట్ల మంది భారతీయులకు అండగా నిలుస్తోంది. బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని, న్యాయం చేస్తామని మరోసారి హామీ ఇస్తున్నాను. ఈ దాడికి పాల్పడిన వారికి, కుట్రదారులకు కఠినంగా సమాధానం చెబుతారన్నారు.
మనం దేశపు గొప్ప శాస్త్రవేత్త డాక్టర్ కె. కస్తూరిరంగన్ జీని కోల్పోయాము. నేను కస్తూరిరంగన్ను కలిసినప్పుడల్లా, భారతీయ యువత ప్రతిభ, ఆధునిక విద్య, అంతరిక్షం-శాస్త్రం వంటి అంశాలపై చర్చిస్తాం.
సైన్స్, ఎడ్యుకేషన్ మరియు భారతదేశం యొక్క అంతరిక్ష కార్యక్రమానికి కొత్త ఎత్తులను అందించడంలో అతని సహకారం ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది. ఆయన నాయకత్వంలో ఇస్రో కొత్త గుర్తింపు తెచ్చుకుంది. అతని మార్గదర్శకత్వంలో ముందుకు సాగిన అంతరిక్ష కార్యక్రమాలు భారతదేశ ప్రయత్నాలకు ప్రపంచ గుర్తింపునిచ్చాయి. భారతదేశం నేడు ఉపయోగిస్తున్న అనేక ఉపగ్రహాలు డాక్టర్ కస్తూరిరంగన్ పర్యవేక్షణలో ప్రయోగించబడ్డాయి.
అతని వ్యక్తిత్వానికి మరో ప్రత్యేక కోణం ఉంది, దీని నుండి యువ తరం నేర్చుకోవచ్చు. అతను ఎల్లప్పుడూ ఆవిష్కరణకు ప్రాధాన్యత ఇచ్చాడు. కొత్తది నేర్చుకోవడం, తెలుసుకోవడం మరియు చేయడం అనే దృక్పథం చాలా స్ఫూర్తిదాయకం. దేశ నూతన జాతీయ విద్యా విధానాన్ని రూపొందించడంలో డాక్టర్ కె. కస్తూరిరంగన్ కూడా ప్రధాన పాత్ర పోషించారు. డాక్టర్ కస్తూరిరంగన్ 21వ శతాబ్దపు ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యను ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో ముందుకు వచ్చారు. దేశానికి ఆయన చేసిన నిస్వార్థ సేవ, దేశ నిర్మాణానికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది.
డా.కె.కస్తూరిరంగన్ గారికి చాలా వినమ్రంగా నివాళులు అర్పిస్తున్నాను. అన్నారు.
ఈ ఏప్రిల్ నెలకు ఆర్యభట్ట ఉపగ్రహం ప్రయోగించి 50 సంవత్సరాలు పూర్తవుతుంది. ఈ రోజు మనం వెనక్కి తిరిగి చూసుకుని 50 ఏళ్ల ఈ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటే మనం ఎంత దూరం వచ్చామో అర్థమవుతుంది. అంతరిక్షంలో భారతదేశం కలలు కనే ఈ విమాన ప్రయాణం ఒకప్పుడు కేవలం నమ్మకంతో ప్రారంభమైంది.
దేశం కోసం ఏదైనా చేయాలనే తపనతో ఉన్న కొంతమంది యువ శాస్త్రవేత్తలు... వారికి నేటి వంటి ఆధునిక వనరులు లేవు, లేదా ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందే అవకాశం లేదు. వారికి ఏదైనా ఉంటే, అది ప్రతిభ, అంకితభావం, కృషి మరియు దేశం కోసం ఏదైనా చేయాలనే అభిరుచి. మన శాస్త్రవేత్తలు ఎద్దుల బండ్లు మరియు సైకిళ్లపై క్లిష్టమైన పరికరాలను స్వయంగా తీసుకువెళుతున్న చిత్రాలను మీరు తప్పక చూసి ఉంటారు.
ఆ అంకిత భావం, దేశ సేవా స్ఫూర్తి ఫలితంగానే ఈ రోజు చాలా మార్పు వచ్చింది. నేడు భారతదేశం గ్లోబల్ స్పేస్ పవర్‌గా మారింది. ఏకకాలంలో 104 ఉపగ్రహాలను ప్రయోగించి రికార్డు సృష్టించాం. చంద్రుని దక్షిణ ధృవాన్ని చేరుకున్న మొదటి దేశంగా మనది అవతరించిందన్నారు.
భారతదేశం మార్స్ ఆర్బిటర్ మిషన్ ను ప్రారంభించింది మరియు ఆదిత్య - L1 మిషన్ ద్వారా మేము సూర్యుడికి చాలా దగ్గరగా చేరుకున్నాము. ఈ రోజు భారతదేశం మొత్తం ప్రపంచంలో అత్యంత ఖర్చుతో కూడుకున్నది కాని విజయవంతమైన అంతరిక్ష కార్యక్రమంలో ముందుంది. ప్రపంచంలోని చాలా దేశాలు తమ ఉపగ్రహాలు మరియు అంతరిక్ష యాత్రల కోసం ఇస్రో సహాయం తీసుకుంటాయి.
మిత్రులారా, ఇస్రో చేసిన ఉపగ్రహ ప్రయోగాన్ని చూసినప్పుడు మనం గర్వంతో నిండిపోతాం. 2014లో పిఎస్ఎల్వి -23 ప్రయోగాన్ని చూసినప్పుడు నాకు అలాంటి అనుభూతి కలిగింది. 2019లో చంద్రయాన్-2 ల్యాండింగ్ సమయంలో బెంగళూరులోని ISRO సెంటర్‌లో నేను కూడా ఉన్నాను. ఆ సమయంలో చంద్రయాన్ ఏసి విఫలమైనా ఎక్కడా వెరచేది లేదన్నారు.


## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో సీడీఎస్ భేటీ



భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS) జనరల్ అనిల్ చౌహాన్ భేటీ అయ్యారు. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భద్రతా దళాలు తీసుకుంటున్న చర్యలు, సరిహద్దులో ప్రస్తుత పరిస్థితుల గురించి చర్చించినట్లు సమాచారం. మరోవైపు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జిత్ సింగ్ చౌధరీ కూడా నార్త్ బ్లాక్‌కు చేరుకున్నారు. సరిహద్దులో పాక్ బలగాలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వేళ ఈ వరుస భేటీలకు ప్రాధాన్యం సంతరించుకుంది.
ఇదిలాఉంటే, పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. వీటిని జీర్ణించుకోలేని పాక్ నేతలు భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఇదే సమయంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న పాక్ సైన్యం.. నియంత్రణ రేఖ (LoC) వెంట దాడులకు పాల్పడుతోంది. వీటిని భారత సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. ఇలా సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పారామిలిటరీ, సైన్యానికి ఇచ్చిన సెలవులు రద్దు చేసి, వెంటనే తిరిగి రావాలని ఆదేశాలు వెళ్లాయి. అటు జమ్మూ కశ్మీర్‌లోనూ భారీగా సైన్యాన్ని మోహరించారు.

మహిళకు రోబోటిక్ సర్జరీ

## ప్రపంచంలోనే అతిపెద్ద అడ్రినల్ కణితి తొలగింపు



న్యూఢిల్లీ : ఓ రోగి కడుపులో నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద అడ్రినల్ కణితిని తొలగించారు దిల్లీలోని సఫ్దర్జంగ్ ఆస్పత్రి వైద్యులు. రోబోటిక్ సర్జరీ చేసి విజయవంతంగా ట్యూమర్ను తీశారు. దీంతో వైద్యులపై ప్రశంసలు వెల్లువెత్తున్నాయి.

**అసలేం జరిగిందంటే?**

36ఏళ్ల మహిళ కడుపులో భారీ అడ్రినల్ కణితి ఉన్నట్లు నిర్ధరణ అయింది. ఈ నేపథ్యంలో సఫ్దర్జంగ్ ఆస్పత్రి వైద్యులు పవన్ వాసుదేవా, నీరజ్ కుమార్, అవిషేక్ మండల్ కలిసి మూడు గంటలపాటు శ్రమించి రోగి శరీరం నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద కణితిని తొలగించారు. ఈ ట్యూమర్ 18.2 x 13.5 సెం.మీల కొలతలు కలిగి ఉందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సందీప్ బన్సల్ తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అడ్రినల్ కణితి అని వెల్లడించారు. దీనిని కనిష్ఠ ఇన్వాసివ్ ప్రక్రియ ద్వారా రోబోటిక్ సర్జరీ చేసి తొలగించారని పేర్కొన్నారు.

**'ఈ సర్జరీ చాలా డేంజర్'**

ఈ సర్జరీ చాలా ప్రమాదకరమని కణితిని తొలగించిన వైద్యుల్లో ఒకరైన డాక్టర్ పవన్ వాసుదేవా తెలిపారు. ఎందుకంటే కణితి చాలా పెద్దదిగా మారడమే కాకుండా శరీరంలోని మూడు ముఖ్యమైన అవయవాలైన ఇన్ఫీరియర్ వీనా కావా, కాలేయం, కుడి మూత్రపిండానికి కూడా తగిలి ఉందని చెప్పారు. దీంతో కణితి చుట్టుపక్కల ఉన్న శరీర భాగాలకు ఇబ్బంది తలెత్తకుండా దాన్ని పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఏర్పడిందని వెల్లడించారు.
"మూడు గంటల పాటు శస్త్రచికిత్స తర్వాత కణితిని తొలగించడంలో విజయం సాధించాం. డావిన్సీ రోబోట్ 3డీ విజన్, దాని రోబోటిక్ హ్యాండ్స్ ల్యాప్రోస్కోపీ చేసే సర్జరీల కన్నా ఎక్కువ కచ్చితత్వంతో సంక్లిష్ట శస్త్రచికిత్సను చేసింది. కణితిని ఎటువంటి సమస్యలు లేకుండా పూర్తిగా తొలగించాం. శస్త్రచికిత్స తర్వాత రోగి కోలుకుంటోంది. ఆమెకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవు. 3 రోజుల్లోనే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యింది.
రోబోటిక్ శస్త్రచికిత్స వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. కచ్చితత్వంతో వేగంగా సర్జరీలను రోబోటిక్ టెక్నాలజీ ద్వారా చేయవచ్చు. రోబోటిక్ సర్జరీ చేస్తే పేషెంట్ వేగంగా కోలుకుంటారు. ఓపెన్ రూట్ ద్వారా సర్జరీ చేస్తే చర్మంపై 20 సెం.మీ పొడవైన గాటు పెట్టాల్సి ఉంటుంది.
అప్పుడు రోగి పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాలు పడుతుంది. రోగులందరికీ అత్యాధు నిక, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను ఉచితంగా అందించడంలో సఫ్దర్ జంగ్ ఆస్పత్రి అంకితభావంతో ఉంటుంది" అని పవన్ వాసుదేవా తెలిపారు.

**ఫ్రీగా రోబోటిక్ సర్జరీ**

అయితే దిల్లీలోని సఫ్దర్జంగ్ ఆస్పత్రిలో ఈ రోబోటిక్ సర్జరీలు ఉచితంగా చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అయితే లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో పేద రోగుల జేబులకు చిల్లు పడుతుంది.


## బీబీసీని బ్యాన్ చేయండి..!

### పాక్ అనుకూల వార్తలు ప్రసారం చేస్తోందని ఆరోపణలు




న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఉగ్రవాదుల ఘటన తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దాయాది దేశంపై భారత్ ఆంక్షలు విధించింది. ఇందులోభాగంగా ఇండియాకి వచ్చిన పాకిస్థానీయుల లాంగ్ టర్న్ వీసాల గడువు నేటితో ముగియనుంది. దేశంలోని చాలా రాష్ట్రాలు తమ రాష్ట్రంలో ఎంత మంది పాక్ జాతీయులు ఉన్నారు, ఆయా వివరాలను వెల్లడిస్తున్నారు.
హెల్త్ వీసాపై వచ్చినవారికి అదనంగా మరో రెండు రోజులు (ఏప్రిల్ 29వరకు) సమయం ఇచ్చింది. ఈ ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి. అయితే ఈ వ్యవహారంలో బీబీసీ మాత్రం పాకిస్థాన్కు అనుకూలంగా వార్తలు వస్తుందని అంటున్నారు చాలామంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తన ఆలోచనను బయటపెడుతున్నారు. పాకిస్థాన్ పర్యాటకులను భారత్ చంపినట్టు బీబీసీ రాస్తుందని మండిపడుతున్నారు.
ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇండియాలో బీబీసీని నిషేధించాలనే వాదన క్రమంగా పెరుగుతోంది. ఇదేకాదు చాలా విషయాల్లో బీబీసీ ఇలాగే చేసిందని అంటున్నారు. ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్యఏం జరిగింది.. జరుగుతుందో యావత్త ప్రపంచానికి తెలుసు.
పహల్‌గామ్ ఉగ్ర దాడి తర్వాత భారత్‌లో అన్నివర్గాల ప్రజల నుంచి పాకిస్థాన్‌పై తీవ్ర వ్యతిరేకత పెరిగింది. దాయాది దేశానికి చెందిన ముఖ్యనేతలు రోజుకో ప్రకటనపై చేయడంపైనా మండిపడుతున్నారు. ప్రతీరోజూ మృతి చెందిన అమరవీరులకు నివాళులు, క్యాండిల్ ర్యాలీలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజల ఆందోళనను గమనించిన మోదీ సర్కార్ వెంటనే చర్యలు చేపడుతోంది కూడా.
భారత్ నుంచి పాకిస్తానీయులు ఒకొక్కరుగా సరిహద్దు దాటి వెళ్లిపోతున్నారు. అలాగే దాయాది దేశంలోఉన్న భారతీయులు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం సాయంత్రం నాటికి భారత్‌లో ఉన్న పాకిస్థానీయులు వెళ్లపోవడం ఖాయం. ఇలా పాకిస్థాన్‌పై అన్ని విధాలుగా ఒత్తిడి తెస్తోంది భారత్. సింధు జలాల ఒప్పందాలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటన చేసిన విషయం తెల్సిందే.
ఇదిలావుండగా జమ్మూకాశ్మీర్లో భద్రతా దళాలు గాలింపు ముమ్మరం చేశాయి. నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు కీలక ప్రాంతాల్లో సోదాలు చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే కాశ్మీర్లో 100కి పైగా టెర్రరిస్టులు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో నిఘా పెంచడంతోపాటు గాలింపు మొదలుపెట్టాయి భద్రతా బలగాలు.
తాజాగా లష్కరే తోయిబా ఉగ్రవాదులతో సంబంధాలున్న వ్యక్తుల ఇళ్లను ధ్వంసం చేస్తున్నాయి బలగాలు. ఉత్తర కాశ్మీర్లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాది ఫరూఖ్ అహ్మద్, బందిపొరాలో అహ్మద్ షీర్, అమీర్ నాజిర్ ఇళ్లను ధ్వంసం చేసినట్టు బలగాలు వెల్లడించాయి.
మరోవైపు పహల్‌గామ్ దాడి కేసును ఎన్ఐఏ(NIA)కి అప్పగించింది కేంద్రం. ప్రభుత్వం ఆదేశాలతో ఆ విభాగానికి చెందిన అధికారులు రంగంలోకి దిగేశారు.

## క్రిమియాను ఎప్పటికీ రష్యాలో భాగంగా గుర్తించం: ఉక్రెయిన్



రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా, క్రిమియాపై రష్యా నియంత్రణను అమెరికా గుర్తించిందని..ఇకపై క్రిమియా రష్యాతోనే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల స్పష్టం చేశారు. తాజాగా ఈ విషయంపై ఉక్రెయిన్ స్పందిస్తూ..అమెరికా చేసిన శాంతి ప్రతిపాదనలో క్రిమియాపై రష్యా అధికారం ఉంటుందని పేర్కొనడం తమను షాక్‌కు గురిచేసిందని పేర్కొంది.
క్రిమియాను తామెన్నటికీ రష్యాలో భాగంగా గుర్తించమని..అమెరికా ప్రతిపాదనను అంగీకరించబోమని తేల్చిచెప్పింది. అమెరికా ప్రతిపాదనకు అసలు అర్థమే లేదని జెలెన్‌స్కీ పార్టీ శాసనసభ్యుడు ఒలెక్సాండర్ మెరెజో? అన్నారు.
క్రిమియాను రష్యా చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుందని..దానిని ఆ దేశానికి పూర్తిగా ఇచ్చేయడం అసాధ్యమని పేర్కొన్నారు. దీనికి తమ దేశ రాజ్యాంగంలో మార్పులు చేయాల్సి ఉంటుందని.. దేశవ్యాప్తంగా ప్రజల అంగీకారం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.
క్రిమియాను వదులుకోవడం అంటే తమ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి రాజకీయ ఆత్మహత్యతో సమానమని అన్నారు. దీనివల్ల ఆయన భవిష్యత్తులో ఎన్నో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.
అంతే కాకుండా దీనిని తమ దేశంలో రాజద్రోహంగా పరిగణిస్తారని.. ఉక్రెయిన్ ప్రభుత్వం ఎప్పటికీ అటువంటి చర్యలు తీసుకోదని అన్నారు. మరోవైపు ప్రపంచ దేశాలు.. ఉక్రెయిన్ ప్రభుత్వం రాజకీయంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పటికీ తాము ఈ పోరాటాన్ని ఎన్నటికీ ఆపబోమని ఉక్రెయిన్ సైనిక అధికారులు పేర్కొన్నారు.
ఈ యుద్ధం వల్ల ఎందరో సైనికులు ప్రాణాలు కోల్పోయా రని.. వారి త్యాగాలకు ఫలితం కచ్చితంగా తమ దేశ ప్రజలకు దక్కాలని అన్నారు. దక్షిణ ఉక్రెయిన్‌లో నల్ల సముద్రం వెంబడి ఉన్న క్రిమియా.. వ్యూహాత్మక ప్రాంతం. 2014లో రష్యా దానిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇదే అంశంపై మాట్లాడిన ట్రంప్.. క్రిమియా రష్యాతోనే ఉంటుందని చెప్పారు.
అయితే, ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులకు పాల్పడుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ఇది సరైన సమయం కాదన్నారు. వారానికి ఐదు వేల మంది సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికైనా శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని పుతిన్‌కు సూచించారు.
శనివారం వాటికన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన అనంతరం ట్రంప్ రష్యా అధ్యక్షుడిపై విరుచుకుపడ్డారు. పుతిన్‌కు యుద్ధం ఆపాలన్న ఉద్దేశం ఉన్నట్లు కనిపించడం లేదన్న విషయం తనకు అర్థమవుతోందని అన్నారు.

పాకిస్థాన్‌తో యుద్ధం

## నేనలా అనలేదు...!



పహల్గాం ఉగ్రదాడిపై మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో యుద్ధం అవసరం లేదంటూ చేసిన వ్యాఖ్యలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శలు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా పాకిస్థాన్ మీడియాలో ఈ వ్యాఖ్యలు ప్రసారం అవుతుండటంతో.. భాజపా శ్రేణులు ఆయన్ను తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఈ క్రమంలోనే సీఎం సిద్ధరామయ్య ఈ విషయమై వివరణ ఇచ్చారు. యుద్ధం వద్దని తాను చెప్పలేదని.. అనివార్యమైతేనే జరగాలని, ఎందుకంటే అది పరిష్కార మార్గం కాదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడకుండా పాకిస్థాన్‌కు గుణపాఠం నేర్పాలని ట్వీట్ కూడా చేశారు. "పాకిస్థాన్‌తో యుద్ధం అవసరం లేదని చెప్పలేదు. సంబంధిత డిమాండ్లకూ నో అనలేదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇరుపక్షాల నడుమ యుద్ధం జరగాలి. అయితే.. ఇది పరిష్కార మార్గం కాదు. కశ్మీర్‌కు పెద్దఎత్తున పర్యాటకులు వెళుతుంటారు. కాబట్టి.. వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్రానికి. ఈ విషయంలో సర్కారు విఫలమైంది. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందారు. అంతకుముందు పుల్వామాలో 40 మంది సైనికులు అమరులయ్యారు.
ఈ ఘటనల్లో నిఘా వైఫల్యం ఉంది. ప్రభుత్వం సరైన భద్రత కల్పించలేకపోయింది. అనివార్యమైతేనే యుద్ధం జరగాలి. అస్సలు చేయకూడదని కాదు. కానీ.. తక్షణమే అవసరం లేదు"అని సీఎం సిద్ధరామయ్య మీడియాతో తెలిపారు. 'ఎక్స్' వేదికలోనూ ఈమేరకు ఓ పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిపై సిద్ధరామయ్య శనివారం మాట్లాడుతూ.. "పాకిస్థాన్‌తో యుద్ధం అవసరం లేదు. మేం దీనికి అనుకూలం కాదు. శాంతియుత పరిస్థితులు ముఖ్యం. ప్రజలకు భద్రత అవసరం. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి" అని వ్యాఖ్యానించారు.
ఇవి కాస్త పాకిస్థాన్ మీడియాలో ప్రసారమయ్యాయి. యుద్ధం విషయంలో సొంత దేశంలోనే వ్యతిరేకత ఉందని ఆ దేశ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. భాజపా సైతం శత్రుదేశానికి కీలుబొమ్మగా వ్యవహరిస్తున్నారంటూ సిద్ధరామయ్యపై మండిపడింది. పాక్ ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పౌరపురస్కారం ఇచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక ట్వీట్ చేశారు. దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని మాజీ సీఎం యడియూరప్ప డిమాండ్ చేశారు. సీఎం మాటలపై వ్యాఖ్యానించేందుకు ఉపముఖ్య మంత్రి డీకే శివకుమార్ నిరాకరించారు. "శాంతి, ఐక్యత, సమగ్రతలు మనకు ముఖ్యం. ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనది. మనమంతా భారతీయులం. దేశాన్ని కాపాడుకోవాలి. ఈ వ్యవహారంపై పార్టీ తీసుకున్న వైఖరికి కట్టుబడి ఉన్నాం" అని డీకే తెలిపారు.

## 'ఎప్పుడైనా, ఎక్కడైనా రెడీ'

### పాకిస్థాన్‌కు ఇండియన్ నేవీ స్ట్రాంగ్ మెసేజ్!



న్యూఢిల్లీ : పహల్గాం ఘటన నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఇండియన్ నేవీ సిద్ధమవుతోంది. అందులో భాగంగా అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. ఈ విషయాన్ని సమాజిక మధ్యమం ద్వారా ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన నేపథ్యంలో సన్నద్ధతను పరీక్షించుకునేందుకు వీటిని ప్రయోగించింది. సముద్ర జలాల్లో ఎప్పుడైనా-ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు ఇండియన్ నేవీ రెడీ అని ప్రకటించింది.
ఇటీవల భారత్ అరేబియా సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎంఆర్-ఎస్ ఏఎం)తో 'సీ స్కిమ్మింగ్' పరీక్షను విజయవంతంగా నిర్వహించింది.
గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది.
సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు తెలిపింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో ప్రయాణించే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీ స్కిమ్మింగ్ టార్గెట్‌లుగా పరిగణిస్తారు.

## ఎన్ఐఏ చేతికి పహల్గాం దాడి వీడియో



పహల్గాం దాడికి సంబంధించిన అత్యంత కీలక ఆధారమైన ఓ వీడియో ఇప్పుడు ఎన్ఐఏ చేతికి వచ్చింది. బైసరన్‌కు వచ్చే టూరిస్టుల కోసం రీల్స్‌ను చిత్రీకరించే ఓ స్థానిక వీడియో గ్రాఫర్ ఈ దాడి మొత్తాన్ని కెమెరాలో బంధించాడు. దాడి జరిగే సమయంలో అతడు ఓ చెట్టుపై దాక్కొని మొత్తాన్ని చిత్రీకరించాడు.
ఆ వీడియోల ఆధారంగా జరిగిన దారుణాన్ని ఓ వరుసక్రమంలో తెలుసుకొనేందుకు జాతీయ దర్యాప్తు సంస్థకు కీలకంగా మారాయి.
ఉగ్రవాదులు రెండు గ్రూపులుగా విడిపోయి లోయలో వేర్వేరు దిక్కుల నుంచి కాల్పులు జరిగినట్లు అధికారులు గుర్తించారు.
తొలుత ఇద్దరు ఉగ్రవాదులు సందర్శకులను ముస్లిం మతాచారాన్ని పాటించమని బెదిరించారు.
ఆ తర్వాత దాదాపు నలుగురిని కాల్చి చంపారు. దీంతో ఒక్కసారిగా భయాందోళనలు మొదలయ్యాయి. సందర్శకులు తలోదిక్కులకు పారిపోగా.. జిప్‌లైన్ అనే ప్రదేశం నుంచి మరో ఇద్దరు ఉగ్రవాదులు బయటకు వచ్చి కాల్పులు మొదలుపెట్టారు.
"ఈ ఫొటోగ్రాఫర్ ప్రాణాలు కాపాడుకోవడానికి పరిగెత్తి.. తూటాలను తప్పించుకోవడానికి చెట్టు కొమ్మపై దాక్కొన్నాడు. ఆ తర్వాత మొత్తం చిత్రీకరించాడు" అని ఓ సీనియర్ అధికారి వెల్లడించాడు.
జాతీయ దర్యాప్తు సంస్థ అతడిని ప్రశ్నించి ఆధారాలు సేకరించింది. ఉగ్రవాదులు, వారికి సహకరించిన ఓవర్ గ్రౌండ్ వర్కర్లను గుర్తించేందుకు ఈ వీడియో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.
ఉగ్రవాదులు స్థానికుల నుంచి రెండు ఫోన్లు కూడా లాక్కొనట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. వీటిల్లో ఒకటి సందర్శకుడిది కాగా.. రెండోది స్థానికులది.
ఇప్పుడు వాటిని ట్రాక్ చేసేందుకు యత్నిస్తున్నారు. వీటి ఆధారంగా ఉగ్రవాదుల ప్రస్తుత లొకేషన్లు కూడా కనుగొనే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దాడి తర్వాత నుంచి అవి స్విచ్చాఫ్ అయినట్లు గుర్తించారు. ఇక ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఎం4 రైఫిల్ ఖాళీ తూటాలను గుర్తించారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి పిల్లల సదస్సు




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: జవహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడి రిషికేశ్ రెడ్డి అధ్యక్షతన జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రోగ్రాం కన్వీనర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ సమక్షంలో జవహర్ బాల్ మంచ్ రాష్ట్రస్థాయి పిల్లల శిక్షణ సదస్సును గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. జవహర్ బాల్ మంచ్ జాతీయ అధ్యక్షులు జి. వి. హరి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జవహర్ బాల్ మంచ్ జాతీయ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఫెన్ రస్సెల్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సులో మొట్టమొదటి జవహర్ బాల్ మంచ్ తెలంగాణ, పిల్లల కమిటీలకు ఎన్నికలు నిర్వహించి వారి జాబితాను ప్రకటించారు. పిల్లల కమిటీ అధ్యక్షులుగా సంతోష్, వైస్ ప్రెసిడెంట్ పునీత్, అంబటి సుచరితను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా రాజ్యాంగం వాటి లక్ష్యాలు- ఆశయాలు- స్ఫూర్తిని, పంచాయతీరాజ్ వ్యవస్థ, స్థానిక సంస్థలు, పర్సనాలిటీ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల మీద పిల్లలకు అవగాహన కోసం ఒక రోజంతా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

జవహర్ బాల్ మంచి పిల్లల యొక్క లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక సంధానకర్తలాగా పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా అధ్యక్షులు రిషికేశ్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కోఆర్డినేటర్లు శివరాజ్, ప్రవీణ్ బాబు,కిరణ్, అంబటి తులసి, రాంబాయి, అభిషేక్, సాయి కృష్ణ, బాల్య నాయక్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్లు సైదేశ్వర రావు, సుదర్శన్, సునీల్, విదుర్ చావ్లా, కోదరి వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాల నుండి తితిలి యూనిట్‌లోని పిల్లలు 200 మంది పైగా పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేశారు.

# మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

- మావోయిస్టుల సమస్యను కేంద్ర ప్రభుత్వం శాంతి భద్రత సమస్య కాకుండా సామాజిక ఆర్థిక, రాజకీయ సమస్యగా చూడాలి
- ప్రధాని మానవత్వంతో ఆలోచించి మావోయిస్టుల సమస్యకు పూర్తి పరిష్కారం చూపాలి
- మావోయిస్టులు కూడా ఆయుధాలు వదిలి ప్రజాస్వామ్యంలోకి వచ్చి పోరాడాలి
- ప్రధాని నరేంద్ర మోదీకి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కాల్పులు విరమిస్తే తాము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూల దృక్పథంతో ఆలోచించి వారినీ చర్చలకు పిలవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రధాని నరేంద్ర మోడీకి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మావోయిష్టుల సమస్యను శాంతి భద్రతల సమస్య పరిగణించకుండా, సామాజిక ఆర్థిక, రాజకీయ సమస్యగా పరిగణించి సానుకూల వాతావరణం కల్పించి తమ బాధ్యతగా కేంద్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి మావోయిస్టులతో చర్చించి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని ఆయన కోరారు.

మావోయిస్టులు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా తాము ప్రభుత్వాలతో చర్చలకు సిద్ధమేనని అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తే ప్రభుత్వంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని వారు ప్రకటించడం చాలా మంచి పరిణామం అన్నారు.

మావోయిస్టులు కూడా ఆయుధాలను వదిలిపెట్టి ప్రజాస్వామ్యంలోకి వచ్చి ప్రజాస్వామ్య బద్దంగా, రాజ్యాంగానికి లోబడి, ప్రజా సమస్యలపై పోరాడాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ మావోయిస్టులకు సూచించారు. మావోయిస్టులు కూడా భారతదేశ పౌరులైనని, సొంత బిడ్డలను చంపుకోవడం కేంద్ర ప్రభుత్వానికి తగదని ఇలాంటి సమయంలోనే ప్రధాని మోదీ విజ్ఞతతో ఆలోచించి నక్సల్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలని ఆయన కోరారు, పోలీసులు, మావోయిస్టులు ఒకరికొకరు శత్రువులు కారని ఇది అనేక సందర్భాలలో నిరూపితమైందన్నారు, మావోయిష్టుల చేతికి పోలీసులు దొరికిన, పోలీసుల చేతికి మావోయిస్టులు దొరికిన ఒకరికి ఒకరు చంపుకోలేదని ఇలాంటి సందర్భంలోనే మానవత్వం నిలబడతుందని ఆయన అన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి బేషాజాలకు వెళ్లకుండా చర్చలు ప్రారంభించాలని దండకారణంలో మరియు కర్రే గుట్టలలో సాగుతున్న భద్రతా దళాల ఆపరేషన్‌ను నిలిపివేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ ట్రాన్స్‌కో ఉద్యోగ నియామకాలు ఎప్పుడు?

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ సిహెచ్ భద్ర చల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చల్లూరి రాంబాబు. జై ద శివకుమార్. పెరుమాండ్ల ప్రహ్లాద్, జూపాక శ్రీనివాస్ ఎమ్మెస్సార్ మరియు ప్రముఖ రచయిత సీనియర్ జర్నలిస్టు కరీం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 174 మంది 2017 నుంచి పెండింగ్లో ఉన్న సుప్రీంకోర్టు కేసును తక్షణమే పరిష్కరించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారంగా వాగ్దానం ప్రకారంగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించి కట్టపరంగా న్యాయపరంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాధితులు తెలంగాణ స్త్రీ సంక్షేమ శాఖ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు హైదరాబాదులో మంత్రి అధికారిక నివాసంలో వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తప్పకుండా ముఖ్యమంత్రికి బాధితుల సమస్యను తీసుకువెళ్లి వివరిస్తాననీ, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క న్యాయపరమైన అన్ని సమస్యలకు సమస్యలను ప్రభుత్వం నుంచి న్యాయం జరిగే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని అప్పటికప్పుడు మంత్రి ప్రత్యేక లెటర్ రాసి నిరుద్యోగ ఇంజనీర్లకు బాసటగా నిలిచారు.

ఈ సందర్భంగ బాధితులు మాట్లాడుతూ మాకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదించవలసిన న్యాయవాదులు సరిగ్గా స్పందించకపోవడం మూలంగా మా జీవితాలు నష్టపోతున్నాం పెద్ద మనసుతో మానవకోణంతో బాధ్యత తోటి న్యాయం చేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు అడ్వకేట్ జనరల్ న్యాయవాది సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున న్యాయంగా వాదించి మాకు న్యాయం చేసి మమ్మల్ని మా కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2018 సబ్ ఇంజనీర్ నియామకాల కోసం మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పించి తమ బాధను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

### పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ వనజీవి రామయ్య

# ఆశయాలతో ముందుకు సాగుదాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ కుమ్మర శాలివాహన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ వనజీవి రామయ్య సంస్మరణ సభ జరిగింది. సంఘం అధ్యక్షుడు డాక్టర్ వి.రవిశంకర్, అధ్యక్షుడు కే. దశరథ్ రావు, ప్రధాన కార్యదర్శి కే. లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాస్, కే. శ్యామ్ కుమార్, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, జి.చంద్రశేఖర్, బాలామణి, శివాని, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ వనజీవి రామయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. ట్యాంకు బండ్ పైన,ఖమ్మంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. ఖమ్మం జిల్లాకు,ఒక విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టాలి. ఆయన కుటుంబంలో ఒకరికి నామినేటెడ్ పదవి ఇవ్వాలి.

ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించలేదు, ఆయనకు అన్యాయం జరిగింది. తగిన గౌరవం దక్కలేదు. జూలై 1న ఆయన జయంతి.

పాఠ్య పుస్తకాలలో ఆయన జీవిత చరిత్రను పాఠ్యఅంశంగా చేర్చాలి. ఆత్మగౌరవ భవనానికి ఆయన పేరు పెట్టాలి.నగరంలో స్మృతి వనం ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం భారతరత్న కోసం కృషి చేయాలి. ఒక్కొక్కరు ఐదు మొక్కలు నాటాలి.

సభకు అధ్యక్షత వహించిన సంగెం సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక వర్గాల వారిగా చూడడం బాగాలేదు. వనజీవి రామయ్య మృతి చెందితే ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అవమాన పరిచిందని భావిస్తున్నాం.

ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఎటువంటి సహకారాలు అందించక పోవడం శోచనీయం. భవిష్యత్తులో ప్రభుత్వం సామాజిక వర్గాల వారిగా కాకుండా అందరికి సమాన గుర్తింపు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.

## ఏపీలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలోని వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కౌతాళం మండలం నదిచాగి, మేలగనూరు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

దీంతో ఆ యా గ్రామాల్లో మోకాళ్ల లోతులో వర్షపు నీరు నిలిచింది. దీంతో కళ్లాలో ఆరబోసిన వరి ధాన్యం నీట మునిగింది.

దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు కన్నీటి పర్యంతమవు తోన్నారు.

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు శనివారం వెల్లడించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో అక్కడక్కడ ఓ మోస్తారు వర్షాలు పడతాయని.. కొన్ని జిల్లాల్లో మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది.

శుక్రవారం మహారాష్ట్ర దక్షిణ ప్రాంతాల నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉన్న ఉత్తర – దక్షిణ ద్రోణి ప్రస్తుతం తెలంగాణ నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా సముద్ర మట్టానికి 0.9కి.మీ ఎత్తులో విస్తరించనుం దని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

దీని ఫలితంగా బలమైన ఈదురు గాలులు సైతం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని తెలిపింది.

# 6 ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లు

### బోధనా ఆసుపత్రులకు 5 గురు కొత్త సూపరింటెండెంట్లు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి బీ ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లను నియమించడంతో పాటు బోధనా స్పత్రులకు ఐదుగురు కొత్త పరింటెండెంట్లను నియమిస్తూ వైద్య, ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు కొత్త పోస్టింగ్ లు మరియు బదిలీలను ఆమోదించారు.

తాజాఆదేశాలలో భాగంగా ముగ్గురు ప్రిన్సిపాళు మరియు ఒక సూపరింటెండెంట్ ను బదిలీ చేయడంతో పాటు ఖాళీలలో ముగ్గురు కొత్త ప్రిన్సిపాళ్లుమరియు ఐదుగురు కొత్త సూపరింటెం డెంట్‌లను వైద్య, ఆరోగ్య శాఖ నియమించింది. వివరాలిలా వున్నాయి

**కొత్త ప్రిన్సిపాళ్లు**

1. ప్రొఫెసర్ (ఓబిజి)గా వ్యవహరిస్తూ ప్రస్తుతం తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యా దేవి ఖాళీగా ఉన్న విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గా నియమితులయ్యారు.

2. కాకినాడ ప్రభుత్వ వైద్య కళాశాలకు మరియు వైస్ ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ (అనస్థీషియా) డాక్టర్ ఎ.విష్ణు వర్ధన్ ను ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఇప్పటి వరకూ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ డి.డి.ఎస్.వి. నరసింహంఇన్చార్జి హెూదాలో డిఎంగా కొనసాగుతారు

3.రాజమహేంద్రవరంలోని జిఎంసిలో ప్రొఫెసర్ (బయో–కెమిస్ట్రీ) పనిచేస్తున్న డాక్టర్ జి.రాజేశ్వరి నెల్లూరులోని జిఎంసి ప్రిన్సిపాల్‌గా నియమించారు.

**కొత్త సూపరింటెండెంట్లు**

1. విశాఖపట్నంలోని ఎఎంసి, ప్రొఫెసర్ (ఎండోక్రినాలజీ)గా పనిచేస్తున్న డాక్టర్ కె.ఎ.వి.సుబ్రమణ్యం, ఒంగోలులోని జిజిహెచ్ సూపరింటెండెంట్గా నియమించారు2. విశాఖ పట్నంలోని ఎఎంసిలో ప్రొఫెసర్ (ఒబిజి)గా పనిచేస్తున్న డాక్టర్ సి.అమూల్యను శ్రీకాకుళం లోని జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించారు

3. విజయవాడలోని జిజిహెచ్‌లో తాత్కాలిక సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎ.వి.రావుకు ఈ పదవికి సంబంధించి శాస్వత బాధ్యతలను అప్పగించారు.

4. శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ (అనస్థీషియా)గా పనిచేస్తున్న డాక్టర్ జె.రాధ తిరుపతిలోని ఎస్వీఆర్ ఆర్జిహెచ్ సూపరింటెం డెంట్‌గా నియమించారు

5. విశాఖపట్నంలోని ఎఎంసిలో ప్రొఫెసర్ (జనరల్ సర్జరీ)గా పనిచేస్తున్న డాక్టర్ వి.మన్మధరావు జిజిహెచ్‌లో సూపరింటెండెంట్ గా నియమించారు

కాగా ఇటీవల మచిలీపట్నంలో ఎడిఎంఇ స్థాయికి పదోన్నతి కోసం సిఫారసు చేయబడిన జాబితా లోని 12 మందిలో ఐదుగురు పదోన్నతి పొందేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ ధోరణిపై ఆందోళన వ్యక్తం చేసిన ఆరోగ్య మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

**బదిలీలు**

1. కాకినాడలోని జిఎంసి ప్రిన్సిపాల్, డిఎంఇగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ డి.వి.ఎస్.ఎల్. నరసింహం ఇన్చార్జి డిఎంగా కొనసాగుతారు

2. కడపలోని జిఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ నంద్యాల జిఎంసికి బదిలీ అయ్యారుబీ

3. ఒంగోలులోని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి. జమున కడపలోని జిఎంసి ప్రిన్సిపాల్గా బదిలీ అయ్యారు.

4. తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్జిహెచ్ సూపరింటెం డెంట్ డాక్టర్ జి. రవి ప్రభు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్గా బాధ్యతలు స్వీకరిస్తారు

పనితీరు సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని పదోన్నతిపై కొత్త పోస్టింగ్లిచ్చారు. అదే విధంగా ఆరోగ్య సమస్యలు, ఇతర అంశాల ఆధారంగా అందిన అభ్యర్థనల్ని పరిశీలించిన మీదట ఈ బదిలీలను చేపట్టారు.

# డీఎస్సీ అభ్యర్థులకు మరిన్ని కష్టాలు



అమరావతి : దేవుడు వరమిచ్చినా పూజారి అనుమతి ఇవ్వలేదన్నట్లు ఉంది ఏపీలో డీఎస్సీ అభ్యర్థుల పరిస్థితి. చాన్నాళ్లు తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థులు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నాయి. కాకపోతే వారికి కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి.

డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు అభ్యర్థులకు కష్టాలు తప్పడంలేదు. విద్యార్హతతోపాటు అన్ని సబ్జెక్టుల్లో మార్కులుంటేనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు తీసుకుంటోంది. లేకుంటే రిజెక్టు చేస్తోంది. దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పాలో ఆయా అభ్యర్థులకు అంతుబట్టడం లేదు. చివరకు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. దీనిపై అభ్యర్థులు ఫిర్యాదు చేసినా సాంకేతిక లోపాలను మాత్రం సరి చేయలేదని చెబుతున్నారు. అసలేం జరిగింది?

స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, తెలుగు ఇతర భాషా సబ్జెక్టుల వారికి డిగ్రీ లేదా పీజీని విద్యార్హతగా నిర్ణయించారు అధికారులు. ఆయా అర్హతలకు సంబంధించి జనరల్ కేటగిరికి 50 శాతం ఉండాలి. అదే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు 45 శాతం మార్కులు ఉండాల్సిందే. ఈ నిబంధనను పెట్టారు అధికారులు. అయితే అభ్యర్థులు వారి విద్యార్హతల దరఖాస్తు నింపుతుంటే అప్లికేషన్ తీసుకోవడం లేదు.

50 శాతం, 45 శాతం అర్హత ఉన్నవారి దరఖాస్తులను మాత్రమే తీసుకుంటోంది. డిగ్రీ అర్హత ఉన్నవారు పీజీ అర్హతను నమోదు చేస్తున్నారు. అందులో పీజీలో 50 శాతం, 45 శాతం మార్కులుంటేనే అనుమతిస్తోంది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి అభ్యర్థులు ఇదే సమస్య వెంటాడుతోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఎలాంటి ఫలితం లేదని అంటున్నారు.

పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్–(పోస్టులకు పీజీలో 50 నుంచి 45 శాతం మార్కులు అర్హత. అలా ఉంటేనే సాఫ్ట్ వేర్ దరఖాస్తు తీసుకుంటుంది. లేకుంటే రిజెక్టు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నార్మల్ గా చెప్పాలంటే పీజీటీ పోస్టులకు విద్యార్హత పోస్టు గ్రాడ్యుయేషన్. డిగ్రీలో కనీస మార్కుల అర్హత ఉంటేనే దరఖాస్తు తీసుకుంటోంది. ఈ సమస్యను అభ్యర్థులు విద్యాశాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్నారని, అమలు జరగడం లేదని అంటున్నారు.

ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రధానంగా డిగ్రీలో 45 శాతం అర్హత మార్కులు డీఎస్సీ దరఖాస్తుకు ఇబ్బందిగా మారింది. 2024 జూన్‌లో నిర్వహించిన టెట్ పరీక్షకు డిగ్రీలో 40 శాతం మార్కులున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులను అనుమతించారు. డీఎస్సీకి దరఖాస్తు చేయాలంటే డిగ్రీలో 45 శాతం మార్కులు ఉండాలని నిబంధన విధించారు.

జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధనల ప్రకారం చేస్తున్నామన్నది అధికారుల మాట. టెట్ నిర్వహణలో సడలింపు ఇచ్చింది. డిగ్రీలో 40 శాతం మార్కులతో బీఈడీ చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులను విద్యాశాఖ అనుమతిస్తోంది. చాలా మంది బీఈడీ పూర్తిచేశారు కూడా. డీఎస్సీకి మాత్రం 45 శాతం నిబంధన పెట్టడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పందించిన పాఠశాల విద్యాశాఖ 40 శాతం మార్కులతో అభ్యర్థులను అనుమతి ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సాచారం. దీనిపై రేపో మాపో ఉత్తర్వులు రానున్నట్లు ప్రభుత్వం వర్గాలు చెబుతున్నాయి.

## ఏపీ లిక్కర్ స్కాం దేశంలో ఎక్కడా లేదు - నిమ్మల



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన లిక్కర్ స్కాం లాంటిది దేశంలో మరెక్కడా జరగలేదని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలంలో ‘మన రైతు మన రామానాయుడు’ కార్యక్రమంలో భాగంగా.. శనివారం ఆయన రూ.కోటితో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ డిస్టిలరీల్లో జరిగిన లిక్కర్ స్కాంతో పోలిస్తే జగన్ లిక్కర్ స్కాం ఎవరెస్టు శిఖరాన్ని తాకుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలి లిక్కర్, సాండ్, మైన్స్, భూముల దోపిడీపైనే నాడు జగన్ దృష్టిపెట్టాడని విమర్శించారు. వైసీపీ నాయకుల పెరట్లో తయారు చేసిన నాసిరకం కల్తీ మద్యంతో లక్షలాదిమంది అనారోగ్యం పాలయ్యారని, వందలాది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు 9నెలల పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని, ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగుతున్నారని రామానాయుడు చెప్పారు.

# కర్రెగుట్టలో భారీ సొరంగం



తెలంగాణ బ్యూరోప్రతినిధి: గత ఆరు రోజులుగా కర్రె గుట్టలలో భద్రతా బలగాలు కూబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.. ఈ ఆపరేషన్ లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజాపూర్, తెలంగాణ సరిహద్దు కర్రె గుట్టలలో భారీ సొరంగాన్ని భద్రతా బలగాలు గుర్తించారు. ఈ సొరంగంలో ఒక ప్రాంతం నుంచి మరో మార్గం ద్వారా బయటికి వెళ్లేందుకు వీలుగా ఉందని భద్రతాదళాలు చెబుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ సొరంగాన్ని స్థావరంగా చేసుకొని మావోయిస్టులు దాడులకు తెగబడ్డారని పేర్కొన్నాయి. అయితే, ఈ సొరంగంలో సరైన గాలి నీరు వాతావరణం ఉంది.. అంతే కాకుండా ఇక్కడ విశాలమైన ప్రాంతం కూడా ఉందన్నారు.ఈ సొరంగంలో 1000 మంది పట్టేంత స్థలం ఉందని అధికారులు వెల్లడించారు.కాగా, కర్రెగుట్ట కొండల్లో నక్సలైట్లపై కొనసాగు తున్న ఆపరేషన్‌లో భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి. ఎండ వేడిమి, 45 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య శ్రమించి.. ఎట్టకేలకు వారి స్థావరానికి చేరుకోగలిగారు. అయితే భద్రతా దళాలు అక్కడికి చేరుకోకముందే మావోయిస్టు లు తమ స్థావరాన్ని మార్చుకున్నట్లు సమాచారం. ఎందుకంటే ఇక్కడ వారు ఉన్నట్టు ఆనవాళ్లు దొరికాయి. ఈ గుహలో చాలా రోజుల పాటు వెయ్యి మందికి పైగా ఆశ్రయం పొందవచ్చని చెప్పుకొచ్చారు. ఈ సొరంగానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను చిత్రీకరించారు. ఇక, పెద్ద సంఖ్యలో మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్ బారిన పడుతున్నారు. ఈ కూంబింగ్ ప్రారంభమైనప్పటి నుంచి నక్సలైట్లు ఆహారం, మంచి నీటి కోసం వెంపర్లాడినట్లు తెలుస్తుంది. నక్సలైట్లు తమను తాము సురక్షితంగా ఉంచుకోవడానికి సుమారు 4 నెలల పాటు రేషన్‌తో కర్రెగుట్ట కొండలలో క్యాంప్ ఏర్పాటుచేసుకున్నప్పటికీ..భద్రతా బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టడంతో.. ఆ రేషన్ కూడా వారికి ఉపయోగపడలేదు.. కొండలపై నుంచి దిగితే సైనికుల తూటాలకు బలి అవుతారనీ, భయంతో కొండలపైనే ఎక్కువకాలం దాక్కుని ఉంటే డీహైడ్రేషన్ వల్ల చనిపోతామనే భయం వారిని వెంటాడుతుంది. మరోవైపు, నక్సలైట్లు దాక్కున్న కొండలను మొత్తం స్వాధీనం చేసుకునేవరకు ఈఆపరేషన్ కొనసాగించాలని భద్రతా దళాలు పట్టుదల తో ఉన్నాయి.ఇక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతిచర్చలకు చొరవ చూపాలం టూ ఇటీవల నక్సలైట్లు ప్రెస్ నోట్ విడుదల చేశారు. అయితే, మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు కోట్లాది రూపాయల రివార్డు ఉన్న వాళ్లందరు కర్రెగుట్టల్లో తలదాచుకుంటున్నారని భద్రతా దళాలు చెబుతున్నాయి. కాగా, 160 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న కర్రెగుట్టలను స్వాధీనం చేసుకునేందుకు భద్రత బలగాలు హెలికాప్టర్ ను ఉపయోగించి దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే 40 మంది మావోయిస్టు చనిపోయినట్లు సమాచారం వస్తున్నప్పటికీ దానిని ఇప్పటి వరకు భద్రతా బలగాలు అధికారికంగా ధృవీకరించలేదు.

### గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్

# ఎన్నికలలో వైసిపి పోటీ?

### టీడీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలలో హైటెన్షన్

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎంపిక టీడీపీ, వైసీపీల్లో హైటెన్షన్ పుట్టిస్తుంది.. నిన్నటివరకూ ఏకపక్షమే అనుకున్న మేయర్ ఎన్నికల్లోకి వైసీపీ అనూహ్యంగా ఎంట్రీ ఇవ్వడంతో టీడీపీ నేతలు ఎలర్ట్ అయ్యారు.. మరోవైపు కూటమి అభ్యర్థిగా టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర నామినేషన్ దాఖలు చేశారు.. మేయర్ ఎన్నికపై వైసీపీ విప్ జారీ చేసింది. అయితే, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కావటి మనోహర్ తనపదవికి రాజీనామా చేశారు. దీంతో మేయర్ ఎన్నిక అనివార్యం అయ్యింది.. టీడీపీ, వైసీపీ పార్టీలు మేయర్ పదవికోసం పోటీ పడుతుండడంతో ఏం జరుగుతుందోననే టెన్షన్ అందరిలో మొదలయ్యింది. దీంతో వైసీపీ, టీడీపీ నేతలు క్యాంప్ రాజకీయాలు మొదలుపెట్టారు. తమ కార్పొరేటర్లను క్యాంపులకు తరలించారు. వాస్తవానికి కార్పొరేషన్ లో వైసీపీకి 46 మంది కార్పొరేటర్ల బలం ఉంది. టీడీపీకి 9, జనసేనకు ఇద్దరు కార్పొరేటర్లు ఉన్నారు. అయితే ఎన్నికలకు ముందు ఐదుగురు, ఎన్నికల తర్వాత 11 మంది వైసీపీ కార్పొరేటర్లు కూటమిలోచేరారు. దీంతో కూటమికి కార్పొరేషన్‌లో బలం పెరిగింది. ఇదే సమయంలో మేయర్ పదవికి కావటి మనోహర్ రాజీనామా చేశారు. మొదట్లో మేయర్ ఎన్నికలకు వైసీపీ దూరంగా ఉంటుందని అందరూ భావించారు. కానీ, వైసీపీ నేతలు తమకు బలం ఉందని, పోటీ చెయ్యకపోతే కూటమికి మేయర్ పదవి దక్కే అవకాశం ఉండడంతో పోటీ చేయాలని భావించింది. ఇందుకు సంబంధించి వైసీపీ నుంచి కార్పొరేటర్లుగా గెలిచిన వారిలో ఒకరిని మేయర్ అభ్యర్థిగా బరిలో దించాలని భావించింది. ఇదే సమయంలో కూటమి తరపున మేయర్ అభ్యర్థిగా టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్రను ప్రకటించింది. పార్టీ బీఫారమ్ కూడా ఇచ్చింది. దీంతో కోవెలమూడి కలెక్టరేట్ లో మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గత నాలుగేళ్లుగా కార్పొరేషన్ లో జరిగిన అవినీతిపై పోరాడామని, గుంటూరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మేయర్ ఎన్నికల్లో తన గెలుపు ఖాయమంటున్నారు. మరోవైపు వైసీపీ కూడా మేయర్ ఎన్నికను సీరియస్ గా తీసుకుంది. గుంటూరు జేసీని వైసీపీ కార్పొరేటర్లు కలిశారు. మేయర్ ఎన్నికలకు సంబంధించి విప్ జారీ చేసేందుకు సంబంధించిన డాక్యుమెంట్లను అందించారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్లను ప్రలోభపెట్టి టీడీపీలోకి బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. మేయర్ ఎన్నికల్లో వైసీపీ కూడా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. వైసీపీ తరపున గెలిచిన కార్పొరేటర్లందరికీ విప్ జారీ చేసినట్లు తెలిపారు. విప్‌కు విరుద్ధంగా ప్రవర్తిస్తే అనర్హత వేటు వేస్తామని తేల్చిచెబుతున్నారు.

సూర్య
హైదరాబాద్
సోమవారం
28 ఏప్రిల్ 2025



suryachitramagazine@gmail.com

సూర్య సినిమా

# 'శుభం' ట్రైలర్ విడుదల



ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నటి-నిర్మాత సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ఈ చిత్రానికి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ మూవీని మే 9న విడుదల చేయబోతోన్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్ ఇలా అన్నీ కూడా ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఇక సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న తరుణంలో శుభం చిత్రం నుంచి ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. శుభం ట్రైలర్‌ను గమనిస్తే.. ఊర్లోని మహిళలంతా కూడా సీరియల్‌ను చూస్తూ వింతగా ప్రవర్తిస్తుంటారు. దెయ్యం పట్టినట్టుగా మహిళలు ప్రవర్తిస్తుంటే.. వారి నుంచి తప్పించుకునేందుకు ఊర్లో పురుషులంతా కూడా అష్టకష్టాలు పడుతుంటారు. అలాంటి తరుణంలో మాతాజీగా సమంత స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చి ట్రైలర్ మీద మరింత ఇంట్రెస్ట్ కలిగించేలా చేశారు. శుభం ట్రైలర్‌ను చూస్తే ఈ చిత్రంలో హాస్యం, హర్రర్, ఉత్కంఠ, ఎమోషన్స్ ఇలా అన్ని రకాల అంశాల్ని జోడించినట్టుగా కనిపిస్తోంది. శుభం మే 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. వివేక్ సాగర్ బీజీఎం స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం ప్రధాన ఆకర్షణ కానుందని తెలుస్తోంది.

# క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ "క్రిమినల్స్ 123"



శ్రీ కనకదుర్గ పిక్చర్స్ బ్యానర్ పై బేబి. బి.డివిష శ్రీ, మాస్టర్ ఆశ్రీత్ ప్రజెన్స్‌లో కె.హైమావతి నిర్మాతగా కె. గీత ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వంశీ కృష్ణ, రియాజ్‌ఖాన్, దినేష్, కలాసి సెల్వన్, విఘ్నేష్, గాయత్రి రిమ తదితరులు నటించిన చిత్రం క్రిమినల్ 123. తమిళ్ లో విడుదలై విజయం సాధించిన రాకాదన్ చిత్రం ఇప్పుడు తెలుగులో క్రిమినల్ 123 పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది, పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న క్రిమినల్ 123 చిత్రం మే మొదటి వారంలో విడుదల థియేటర్స్ లో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సినిమాను దినేష్ కలై డైరెక్ట్ చేశారు, ఏ ప్రవీణ్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమాకు మానస్ బాబు సినిమాటోగ్రఫీ అందించగా గోపికృష్ణ ఎడిటింగ్ చేశారు. కాకర్లమూడి రవీంద్ర కళ్యాణ్ ఈ చిత్రానికి మాటలు రాశారు. త్వరలో ఈ చిత్ర సాంగ్స్, ట్రైలర్ విడుదల చేయబోతున్నారు మేకర్స్. కె.జే.ఆర్ పిక్చర్స్ రామకృష్ణ, కిషోర్, జయబాబు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయబోతున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించబోతున్నారు.

## ఇంటెన్స్ ఎమోషన్స్ వున్న ఫస్ట్ ఆఫ్ ఇట్స్ కైండ్ 'పేషన్'

యంగ్ ట్యాలెంటెడ్ సుధీస్, అంకిత హీరో హీరోయిన్స్ గా అరవింద్ జాషువా దర్శకత్వంలో రూపొందుతున్న ఇంటెన్స్ ఎమోషనల్ లవ్ స్టోరీ 'పేషన్'. REDANT క్రియేషన్ బ్యానర్ పై నరసింహా యేలే, ఉమేష్ చిక్కు, రాజీవ్ సింగ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ ని క్రియేటివ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల లాంచ్ చేశారు. డైరెక్టర్




శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. అరవింద్ జాషువా ఆనంద్ సినిమా నుంచి నాకు పరిచయం. అప్పటిలోనే తనలో స్టోరీ టెల్లింగ్ రైటింగ్ క్రియేటర్ ఉన్నాడని అనిపించింది. తను పేషన్ అని ఒక నవల రాశారు. అది నేను చదివాను. చాలా బాగుంది. తను వచ్చిన ఫ్యాషన్ బ్యాక్ గ్రౌండ్ గురించి ఇందులో రాశారు. అందుకే చాలా అథెంటిక్ గా ఉంది. ఇది ఫస్ట్ ఆఫ్ ఇట్స్ కైండ్ ఫిల్మ్. ఈ సినిమా చాలా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అరవింద్ మంచి మ్యూజిక్ టేస్ట్ ఉంది. స్క్రిప్ట్ చాలా బాగుంది. నిర్మాతలు అందరూ కొత్తవాళ్లు. వీళ్లంతా చాలా ప్యాషన్ తో సినిమా తీస్తున్నారు. వాళ్ళందరికీ కంగ్రాట్యులేషన్స్. ఈ పోస్టర్ డిజైన్ చాలా బాగుంది. టీమ్ అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్. కొత్త ఫ్లేవర్ తో వచ్చిన సినిమాలుని ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ సినిమాని కూడా అంత అద్భుతంగా ఆదరిస్తారని నమ్ముతున్నాను. టీమ్ అందరికీ కంగ్రాజులేషన్స్'అన్నారు. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ మూవీ పుట్టకముందు నవలగా పబ్లిష్ చేయబడిన ఛాయా పబ్లికేషన్స్ కి థాంక్యూ. ఈ నవల చదివిన తర్వాత అందరూ ఇన్స్పైర్ అయ్యి మూవీగా తీసుకురావాలనే తపని అందరూ అర్థం చేసుకున్నారు. శేఖర్ కమ్ముల గారి బ్లెస్సింగ్స్ లేకపోతే ఈ మూవీ అయ్యేది కాదు. ఆయన బిజీ షెడ్యూల్లో ఉన్నప్పుడు కూడా ఈ సినిమాకి సపోర్ట్ చేయడానికి వచ్చారు మా అందరి తరపున శేఖర్ కమ్ముల గారికి ధన్యవాదాలు. ఈ సినిమా చాలా మంచి మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'అన్నారు.

# రెట్రో ఘన విజయం సాధించాలి -విజయ్‌దేవరకొండ



కోలీవుడ్ స్టార్ సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రెట్రో'. పూజా హెగ్డే కథానాయిక. సూర్య, జ్యోతిక నేతృత్వంలోని 2D ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపుదిద్దుకున్న ఈ చిత్రం, మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. తెలుగునాట ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండటం విశేషం. హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో 'రెట్రో' ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. ప్రముఖ కథానాయకుడు విజయ్‌దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయ్‌దేవరకొండ మాట్లాడుతూ, మీరందరూ బాగున్నారని అనుకుంటున్నాను. మీరందరూ బాగుండాలని కోరుకుంటున్నాను. సినిమా గురించి మాట్లాడేముందు.. ముందుగా పహల్గాం బాధితులకు నివాళులు. సూర్య అన్న మూవీ ప్రమోషన్ కోసం నేను ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. నేను గజిని సినిమా చూసి సూర్య అన్నతో ప్రేమలో పడిపోయాను. ఎవర్రా ఈయన, ఇంత బాగా నటిస్తున్నాడు అనుకొని.. సూర్య అన్న నటించిన మిగతా సినిమాలన్నీ చూశాను. సూర్య సన్నాఫ్ కృష్ణన్ నా మనసుకి బాగా నచ్చిన సినిమా. చంచల సాంగ్ చూసి భావోద్వేగానికి గురయ్యాను. ఆ పాట నాకెప్పటికీ ఓ మంచి జ్ఞాపకం. సూర్య అన్నను తెరమీద చూసి.. అసలు ఈ మనిషి బాడీ ఏంటి, యాక్టింగ్ ఏంటి, డ్యాన్స్ ఏంటి? ఒక్కసారైనా జీవితంలో కలవాలి అనుకున్నాను. అలాంటిది ఇప్పుడు ఆయనతో వేదిక పంచుకోవడం ఎప్పటికీ మరిచిపోలేను. నటుడిగా సూర్య అన్న అంటే నాకెంతో ఇష్టం. ఆయన సినిమాల ఎంపిక మిగతా నటుల్లో స్ఫూర్తి నింపేలా ఉంటుంది. విభిన్న జానర్స్ లో సినిమాలు చేస్తుంటారు. రెట్రోతో సూర్య అన్న మరో ఘన విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. అగరం ఫౌండేషన్ ద్వారా సూర్య అన్న ఎందరో విద్యార్థులకు అండగా నిలబడుతున్నారు. ఆయన స్ఫూర్తితో నేను కూడా విద్యార్థులకు సాయం చేయాలి అనుకుంటున్నాను. మే 1న విడుదలవుతున్న రెట్రో సినిమాని అందరూ చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను" అన్నారు.

## పది కాలాలు గుర్తుండే అచ్చమైన తెలుగు సినిమా

# 'సారంగపాణి జాతకం'

సెన్సిబుల్ డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ, నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ సక్సెస్ ఫుల్ కాంబోలో వచ్చిన మూడో చిత్రం 'సారంగపాణి జాతకం'. శ్రీదేవీ మూవీస్ బ్యానర్ మీద నిర్మించిన ఈ చిత్రంలో ప్రియదర్శి, రూపా కొడవయూర్ జంటగా నటించారు. ఏప్రిల్ 25న విడుదలైన ఈ సినిమాకి మంచి ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ఆదివారం (ఏప్రిల్ 27) నాడు 'ఫన్'టాస్టిక్ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో



ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూలి ..'శివలెంక కృష్ణ ప్రసాద్‌తో నేను ఇది వరకు 'సమ్మోహనం', 'జెంటిల్ మెన్' చిత్రాలు చేశాను. ఇప్పుడు 'సారంగపాణి జాతకం' చేశాం. ఈ మూడు చిత్రాలు కూడా గొప్పవే. ప్రేక్షకులు పది కాలాల పాటు గుర్తు పెట్టుకునే సినిమాలు మా కాంబినేషన్‌లో వచ్చాయి. ఓ దర్శకుడిని ఇంతగా నమ్మి, స్వేచ్ఛనిచ్చే నిర్మాతలు ఇప్పుడు కరువవుతున్నారు. మేం ఈ చిత్రాన్ని ఎంతో ప్రేమించి చేశాం. ఇప్పుడు ఆడియెన్స్ ముందుకు వచ్చింది.. మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఫ్యామిలీస్ ఇప్పుడిప్పుడే థియేటర్లకు వస్తున్నారు. ఈ సినిమాను బ్లాక్ బస్టర్ హిట్ చేయాలని కోరుకుంటున్నాను. ప్రియదర్శి ఈ సినిమాలో అద్భుతంగా నటించారు. నేను అనుకున్న దాని కంటే వెయ్యి రేట్లు ఎక్కువగా నటించారు. వైవా షార్ట్ ఫిల్మ్‌ను మా ఇంట్లో ఎప్పుడూ చూస్తూనే ఉంటాం. మంత్ ఆఫ్ మధు చూసిన తరువాత హర్షను మరింత వాడుకోవాలని అనుకున్నాను. హర్ష సత్తాను ఎంతో కొంత బయటకు తీసుకు వచ్చానని అనిపిస్తోంది. అశోక్ చిన్న పాత్రే అయినా అద్భుతంగా నటించారు. నివిత కూడా చక్కగా నటించారు. రూపా అద్భుతమైన నటి. తెలుగు కళాకారిణిలో ఆమె ఓ గొప్ప నటిగా ఎదుగుతారు. వివేక్ సాగర్, మార్తాండ్ కే వెంకటేష్, విందా, ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ అందరూ అద్భుతంగా పని చేశారు. రామ జోగయ్య శాస్త్రి నాలుగు అద్భుతమైన పాటలు రాశారు. ఈ చిత్రానికి నా సీక్రెట్ హీరో సురేష్. నా డైరెక్షన్ టీం ఎంతో అండగా నిలబడింది. అచ్చమైన తెలుగు నటులు నటించిన తెలుగు సినిమాను అందించాం. ఇది నా కెరీర్‌లో స్పెషల్ మూవీ కానుంది. ఈ చిత్రాన్ని తీసే క్రమంలో తోడ్పడిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీని ఇంతలా ఆదరిస్తున్న మీడియాకి, ఆడియెన్స్‌కి నా ధన్యవాదాలు' అని అన్నారు.

# పహల్గాం ఉగ్రదాడి పై ఎఫ్ఎన్‌సిసి తీవ్ర దిగ్భ్రాంతి

ఐక్యత.. సామరస్యం, రాజ్యాంగ విలువలు పై దాడిని ఖండించిన సభ్యులు. పహల్గామ్‌లో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పై ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఉగ్రవాద దాడిలో అమరులైన వారికి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా నిర్మాత, ఎఫ్.ఎన్.సి.సి. ప్రెసిడెంట్ కె యస్




రామారావు మాట్లాడుతూ.. పహల్గాంలో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పట్ల మేం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాం. ఉగ్ర దాడిలో 26 మంది అమాయక పౌరులు మరణించారు, అనేక మంది గాయపడ్డారు. ఈ చర్యను తీవ్రంగా ప్రతిఘటించాలని అందుకు మోడీ ప్రభుత్వానికి ఎఫ్.ఎన్.సి.సి. సంఘీభావం తెలుపుతుందని తెలియజేసారు. అన్ని వేళలా మోడీ ప్రభుత్వం తీసుకునే చర్యలకు మా పూర్తి మద్దతు తెలుపుతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల రంగారావు మాట్లాడుతూ.. భారత ప్రజలకు మేం సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

# ఖుషి డాన్స్ స్టూడియో తొలి వార్షికోత్సవం




హీరో రాజు, భార్య సుహానా కలిసి కుమార్తె ఖుషి పేరు మీద తమ కలలు సహకారం చేసుకునే విధంగా మొదలుపెట్టిన ఖుషి డాన్స్ స్టూడియో ప్రారంభమై సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా కూకట్‌పల్లిలోని వారి డాన్స్ స్టూడియో వద్ద తొలి వార్షికోత్సవ వేడుకలు చేసుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కుతుబుల్లా నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హాజరయ్యారు. అలాగే చిత్రం శ్రీను, సోదర చిత్ర నటుడు సం జోష్, అన్వేషి చిత్ర నిర్మాత కిరణ్ కందుల, కొరియోగ్రాఫర్ బాబి, పంచ్ ప్రసాద్ ఇంకా మరికొందరు సినీ సెలబ్రిటీలు, కొరియోగ్రాఫర్లు, డాన్సర్స్ పాల్గొని ఈ వేడుకను మరింత ఘనవిజయం చేశారు. ఈ సందర్భంగా తమ దగ్గర డాన్స్ నేర్చుకుంటున్న స్టూడెంట్స్‌తో కొన్ని డాన్స్ ప్రోగ్రాములు చేసి తమ ప్రతిభను చాటి చెప్పుకుంటూ ఆ వేడుకను మరింత కళాత్మకంగా చేశారు. ఈ సందర్భంగా సోదర చిత్ర నటుడు సంజోష్ మాట్లాడుతూ... "డాన్స్ చేయడం అనేది ఎంత కష్టమైన విషయమో నటుడుగా నాకు తెలుసు. పిల్లలు చాలా బాగా డాన్స్ చేస్తున్నారు.

# 'కిష్కింధపురి' ఫస్ట్ లుక్



డిఫరెంట్ అండ్ వెరైటీ సబ్జెక్ట్స్ చేస్తున్న యాక్షన్ హల్క్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన 11వ మూవీ బిఎస్ఎస్11ను షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై చేస్తున్నారు. డైనమిక్, ప్యాషనేట్ నిర్మాత సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తోంది. గ్రిప్పింగ్ హర్రర్-మిస్టరీ బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా ఉండబోతోంది. మేకర్స్ ఇప్పుడు అఫీషియల్ గా సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కిష్కింధపురి అనే టైటిల్ మిస్టరీని, మైథాలజీ గ్రాండియర్ ని సూచిస్తోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ఎక్సయిటింగ్ ఎక్స్ ప్రెషన్స్ తో కనిపిస్తున్నారు. చేతుల్లో జ్వాలలు పట్టుకుని, బెల్లంకొండ శ్రీనివాస్ , అనుపమ ఇద్దరూ అడవిలో ఏదో వెతుకుతున్నట్లు కనిపించారు. బ్యాక్ డ్రాప్ లో ఒక బంగ్లా కనిపించడం థ్రిల్లింగ్ వైబ్ ని పెంచుతోంది. టైటిల్, పోస్టర్ రెండూ అంచనాలను పెంచడంలో విజయవంతమయ్యాయి. ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఏప్రిల్ 29న సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేస్తామని ప్రకటించారు. టాప్ టెక్నిషియన్స్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ చిన్మయ్ సలాస్కర్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, సంగీతం సామ్ సిఎస్ సమకూర్చారు. ప్రొడక్షన్ డిజైన్‌ను మనీషా ఎ దత్ నిర్వహిస్తున్నారు, డి. శివ కామేష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

# కాశ్మీర్ మనదే కాశ్మీర్ ప్రజలు మనవాళ్లే

కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడుల క్రూర చర్యను దేశమంతా ముక్తకంఠంతో ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో కాశ్మీర్ పై హీరో విజయ్ దేవరకొండ బ్రేవ్ కామెంట్స్ చేశారు. సూర్య హీరోగా నటించిన రెట్రో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు విజయ్ దేవరకొండ. ఈ కార్యక్రమంలో విజయ్ కాశ్మీర్ పై చేసిన ఇన్స్ పైరింగ్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ - కాశ్మీర్ మనదే కాశ్మీర్ ప్రజలు మనవాళ్లే. నేను ఖుషి సినిమా షూటింగ్ కాశ్మీర్ లో చేశాం. అక్కడి ప్రజలు చాలా మంచివారు. కాశ్మీర్ లో ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న పాకిస్తాన్ కు ఆ దేశ ప్రజలే బుద్ధి చెబుతారు. అన్నారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044